నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com

## ధరణి పోర్టల్‌తో అవినీతి తగ్గింది.. పారదర్శకత పెరిగింది : మంత్రి హరీశ్‌రావు

కామారెడ్డి, డిసెంబర్ 3:భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌పై అడ్డగోలు మాట్లాడటం సరికాదని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆ పోర్టల్ గురించి తెలుసుకోకుండా కొంత మంది మూర్ఖులు ఏదేదో వాగుతున్నారని మండిపడ్డారు. రూపాయి లంచం లేకుండా పట్టా పాస్ పుస్తకాలు ఇంటికి వస్తున్నాయి. త్వరలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలను పరిష్కారిస్తామన్నారు. ధరణితో అవినీతి తగ్గింది. పారదర్శకత పెరిగింది. వేగవంతమైన పాలన అందుతుందని మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల అధికారులు కూడా ధరణి పోర్టల్‌ను చూసి చాలా నేర్చుకున్నారని తెలిపారు.

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటైన డోంగ్లి మండలాన్ని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. మండల కార్యాలయం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. డోంగ్లి మండలం ఏర్పాటు ఎన్నో ఏళ్ల కల. ఆ కలను నిజం చేసింది సీఎం కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. కొత్త జిల్లాలు, మండలాలు, పంచాయతీలు ఏర్పాటు చేసుకున్నాం. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉన్న 466 మండలాలను 612 కు పెంచామన్నారు.

హైదరాబాద్ ఆదివారం 4-12-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 90 పేజీలు:6 వెల: రూ.1/-

# ఆత్మవిశ్వాసమే జీవితానికి పరిపూర్ణత -ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు

హైదరాబాద్, డిసెంబర్ 3: ప్రపంచంలో సంపూర్ణ మానవుడు అంటూ లేరని, సమస్యలను అధిగమిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడం ద్వారానే జీవితానికి పరిపూర్ణత చేకూరుతుందని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మన్యూనతకు లోనవకుండా, ఆత్మస్థైర్యంతో లక్ష్యాలను సాధించాలని దివ్యాంగులకు సీఎం పిలుపునిచ్చారు. ఆసరా అవసరమైన దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని, తెలంగాణ రాష్ట్రం దివ్యాంగుల సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

దివ్యాంగుల సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రాన్ని అత్యుత్తమ రాష్ట్రంగా గుర్తించి కేంద్రం అవార్డులు అందించిన విషయాన్ని సీఎం గుర్తు చేసుకున్నారు. దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధను కనబరిచే ఉద్దేశంతో మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి దివ్యాంగుల (వికలాంగుల) శాఖను ప్రత్యేక శాఖగా స్వతంత్ర విభాగంగా ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు.

ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలు దివ్యాంగులకు రూ. 500 పెన్షన్‌తో సరిపడితే, స్వరాష్ట్రంలో ఒక కుటుంబంలో ఎంతమంది దివ్యాంగులు ఉంటే అంతమందికి రూ.3016 పింఛన్ అందిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తున్నామని చెప్పారు. దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు పథకాలతోపాటు ఇతర పథకాల్లో 5 శాతం రిజర్వేషన్, ఉద్యోగ నియామకాలలో 4 శాతం రిజర్వేషన్‌ను అమలుచేస్తున్నామని సీఎం అన్నారు.

పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న దివ్యాంగుల కోసం ఉచిత కోచింగ్‌తోపాటు మెటీరియల్, ఉద్యోగ సర్వీసుల్లో ప్రత్యేక అలవెన్సులు, ఎకనామిక్ రిహాబిలిటేషన్ సెంటర్లు, దివ్యాంగుల సలహా మండలి, ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వెల్లడించారు. దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్లు, త్రీ వీలర్ స్కూటీలు, చేతికర్రలు మొదలైనవి సమకూరుస్తూ రోజువారి జీవితంలో వారు ఎదుర్కొనే ప్రతిబంధకాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక విద్యను అందించేందుకు ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు ఏర్పాటు చేయడంతోపాటు ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామని సీఎం కేసీఆర్ అన్నారు. ఇలా అవకాశమున్న ప్రతీచోట వారి ఆత్మగౌరవాన్ని, ఆత్మస్థైర్యాన్ని, సాధికారతను పెంచే దిశగా అవసరమైన అన్ని కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నదని వెల్లడించారు. రాబోయే కాలంలో దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మరెన్నో కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నదని పేర్కొన్నారు. దివ్యాంగులను మనలో ఒకరుగా ఆదరిస్తూ వారి సాధికారత కోసం సమాజంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు.

## పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో నేషనల్ డెంటల్ కమిషన్ బిల్లు

న్యూఢిల్లీ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో నేషనల్ డెంటల్ కమిషన్ బిల్లు-2022ను ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. డెంటిస్ట్స్ యాక్ట్-1948ను రద్దుచేసి దాని స్థానంలో నేషనల్ డెంటల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నది ఈ బిల్లు ఉద్దేశం. బిల్లు ఆమోదం పొందితే ప్రస్తుతం డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న పాత్రనే ఔఆఅ నిర్వహించనుంది.రెండున్నరేండ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ని నేషనల్ మెడికల్ కమిషన్‌గా మార్పు చేసింది. అదే విధానంలో ఇప్పుడు డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాని నేషనల్ డెంటల్ కమిషన్‌గా మార్చాలని కోరారు.

## ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లపై పునఃపరిశీలన చేయాలి: జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: దేశంలో అమలవుతున్న ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లపై పునఃపరిశీలన చేయాలని, పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో దీనిపై చర్చ జరపాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ చట్టం సవరణకు సుప్రీంకోర్టుకు చెందిన ముగ్గురు న్యాయమూర్తులు అంగీకారం తెలిపారని, మరో ఇద్దరు దీనిపై ప్రశ్నలు లేవనెత్తారని, అప్పటి నుంచి ఈ రిజర్వేషన్‌లపై రకరకాల వాదనలు వినిపిస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరామ్ రమేశ్ చెప్పారు.అదేవిధంగా కులపరమైన జనగణనకు కూడా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్నదని, కులపరంగా జనగణన కచ్చితంగా జరిగి తీరాల్సిందేనని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ మూడు ప్రధాన అంశాలను లేవనెత్తనుందని ఆయన చెప్పారు. భారత్-చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, అధిక ధరలు, దేశంలోని రాజ్యాంగబద్ధమైన, స్వతంత్ర సంస్థల కార్యకలాపాల్లో జోక్యం అనేవి తాము పార్లమెంటులో లేవనెత్తబోయే ప్రధాన అంశాలని జైరామ్ తెలిపారు.

# ఆరో తేదీన హైదరాబాద్‌లో ఏమి జరుగనుంది!

హైదరాబాద్ డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అమిత్ ఆరోడాను అరెస్టుచేసి.. రిమాండ్ కు తరలించిన సందర్భంలో సిద్ధం చేసిన రిపోర్టులో ఎమ్మెల్సీ కవిత పేరు తొలిసారి బయటకు వచ్చింది.ఈ రిపోర్టులో కవిత పేరు వచ్చిన రెండు రోజులకు సీబీఐ నోటీసులు జారీ చేయటం తెలిసిందే. ఇదే విషయాన్ని ఎమ్మెల్సీ కవిత సైతం ధ్రువీకరించారు. ఆరో తేదీన హైదరాబాద్ లోనే తన ఇంటికి సీబీఐ అధికారులు రావాలని కోరినట్లుగా ఆమె వెల్లడించారు. మరి.. తర్వాతేం జరుగుతుంది? కవిత అరెస్టు తప్పదా? అసలు అక్కడి వరకు విషయం వెళుతుందా? ముఖ్యమంత్రి కేసీఆర్ విషయాన్ని అక్కడి వరకు తీసుకెళతారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

టీఆర్ఎస్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం చూస్తే.. ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు తిప్పలు తప్పవన్న మాట వినిపిస్తోంది. కేంద్ర.. రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య నడుస్తున్న పోరు నేపథ్యంలో తనకు లభించిన అవకాశాన్ని మోడీషాలు అస్సలు వదులుకోరని చెబుతున్నారు. తమతో పెట్టుకున్న వారు ఎవరైనా సరే.. వారి స్థాయి ఏమైనా సరే.. లెక్కలు తేల్చాల్సిందే అన్నట్లుగా వారి మైండ్ సెట్ ఉంటుందని చెబుతారు. ఒకవేళ రాజీకి వస్తే అన్న మాటకు భిన్నమైన సమాధానం వినిపిస్తోంది.

తమతో లడాయికి దిగిన వారికి ఏదో ఒక నష్టం వాటిల్లేలాచేసి.. ఆ డ్యామేజ్ తర్వాతే మౌనంగా ఉండటం మోడీషాలకు అలవాటుగా చెబుతారు. గడిచిన కొంతకాలంగా చోటు చేసుకున్న పరిణామాలు ఇదే విషయాన్ని చెబుతాయమంటున్నారు. దేశంలోని మరే రాష్ట్ర ముఖ్యమంత్రి చేయనంత డ్యామేజ్ తమకు కేసీఆర్ కారణంగా జరిగినట్లుగా మోడీషాలు భావిస్తున్నారు. ఎమ్మెల్యేల ఎర ఎపిసోడ్ కు సంబంధించి కేసీఆర్ అన్ని గీతలు దాటేశారని.. అలాంటప్పుడు ఇప్పుడు తాము వెనక్కి తగ్గాల్సిన అవసరం ఏమిటి? అన్నది ప్రశ్నగా మారింది.

మిగిలిన సంగతులు ఎలా ఉన్నా.. ఢిల్లీ మద్యం కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లుగా స్వయంగా టీఆర్ఎస్ కు చెందిన కీలక నేతలు తమ ప్రైవేటు సంభాషణల్లో చెబుతున్నారు. తగ్గించలేనంత దూరం మోడీషాలకు కేసీఆర్ కు పెరిగిందని.. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏదో ఒక కీలక పరిణామం చోటు చేసుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు.

తాము అంచనా వేసినట్లుగానే కేంద్ర విచారణ సంస్థలు కవితను అరెస్టు చేస్తే.. వేధింపుల్లో భాగంగానే ఇదంతా జరిగిందన్న మాటతో పాటు.. భారీ ఎత్తున సానుభూతి వ్యక్తమయ్యేందుకు ఏమేం చర్యలు తీసుకోవాలన్న దానిపై గులాబీ దళం కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు. మరి.. కవిత అరెస్టు తథ్యమైతే.. డేట్ ఎప్పుడు ఉంటుందన్న దానిపై ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. కొత్త సంవత్సరం రాక ముందే.. అరెస్టు తప్పదన్న మాట కొందరు టీఆర్ఎస్ కు చెందిన మంత్రుల నోట వస్తోంది. మరి.. వీరి అంచనాలు ఎంతమేర నిజమవుతాయో కాలమే సరైన సమాధానం ఇవ్వగలదు.మొత్తానికి ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించిన పరిణామాలు చాలా వేగంగా సాగిపోతున్నాయి. ఒకటి తర్వాత ఒకటి చొప్పున చోటు చేసుకుంటున్న పరిణామాలు బ్రేకింగ్ న్యూస్ గా మారుతున్నాయి. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అమిత్ ఆరోడాను అరెస్టుచేసి.. రిమాండ్ కు తరలించిన సందర్భంలో సిద్ధం చేసిన రిపోర్టులో ఎమ్మెల్సీ కవిత పేరు తొలిసారి బయటకు వచ్చింది.

# నేను డాక్టర్ అవ్వాలని అమ్మ ఆశపడింది: మంత్రి కేటీఆర్




హైదరాబాద్, డిసెంబర్ 3: వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రతి ఇంట్లో వారి పిల్లల్లో ఒకరైన డాక్టర్ కావాలని కోరుకుంటారు. అలానే నేనూ డాక్టర్ అవ్వాలని మా అమ్మ కోరుకుందని మంత్రి చెప్పారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్‌లో జరిగిన ఉమెన్ ఇన్ మెడిసిన్ కాంక్లేవ్‌కు మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్యులు కుటుంబ జీవితాన్ని త్యాగం చేస్తారన్నారు. ఎప్పుడు ఏ ఎమర్జెన్సీ ఉన్నా అటెండ్ అవుతారని తెలిపారు. వైద్య రంగంలో మహిళలు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు. వైద్యులందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అన్నిరంగాలకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని చెప్పారు. తెలంగాణ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని తెలిపారు. మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి వీ-హబ్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో మహిళా యూనివర్సిటీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నామని వెల్లడించారు. జెండర్ ఈక్వాలిటీ పాలించే రాష్ట్రాల్లో తెంగాణ ఒకటన్నారు.

కొన్నేండ్లుగా భారతీయ వైద్యరంగం ఎంతో పురోగతి సాధించిందని అన్నారు. కరోనా సమయంలో ఏఐజీ ఆస్పత్రి మంచి సేవలు అందించిందని చెప్పారు.

# జీహెచ్ఎంసి ఆధ్వర్యంలో ముమ్మరంగా ఓటరు నమోదు ప్రక్రియ




హైదరాబాద్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా రెండవ విడత శనివారం హైదరాబాద్ నగరంలో ముమ్మరంగా ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగింది. రాంనగర్ లోని జెవి పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ లలో బిల్ కలక్టర్ పి.సునంద,జిహెచ్ఎంసి (ఆర్పి )రిసోర్స్ పర్సన్ తారా నేతృత్వంలో ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగింది.ఈ సందర్భంగా ఈ ఓటర్లకు తగిన సలహాలు చేస్తూ కొత్త ఓటర్లను నమోదు చేసారు.చేస్తు 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ఫారం 6 ద్వారా ప్రత్యేక ఓటరుగా తమ పేరును నమోదు చేసారు.. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులను, దివ్యాంగులను ట్రాన్స్జెండర్ లను ఓటర్లుగా నమోదు చేసారు.ఈ కార్యక్రమం లో బిసి ఐక్యవేదిక ఒబిసి గ్రేటర్ అధ్యక్షురాలు వాణి రెడ్డి,గురుదీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీసులపై మంత్రి కేటీఆర్ ప్రశంసలు



హైదరాబాద్, డిసెంబర్ 3: సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడే విధంగా పోలీసులు సమర్థవంతంగా పని చేస్తున్నారని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రశంసించారు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో పోలీసు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ సైబర్ సేఫ్టీ వ్యవస్థను హోం మంత్రి మహమూద్ అలీతో కలిసి కేటీఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ మహేందర్ రెడ్డి, సైబరాబాద్ సీపీ స్టీఫేన్ రవీంద్రతో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దేశంలోని సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీసులు తీసుకుంటున్న చర్యలను మంత్రి కేటీఆర్ కొనియాడారు. పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యంతో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# అమరవీరుల స్థూపానికి పాలాభిషేకం..

హైదరాబాద్, డిసెంబర్ 3: తెలంగాణ ఉద్యమ కాలంలో వందలాది మంది విద్యార్థులు అమరులు అవ్వడానికి కారణమైన ఆంధ్రా కుట్రదారుల సంతానం ఇవాళ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించడం అత్యంత హేయమైన చర్యగా టీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు పేర్కొన్నారు. ఉద్యమ కుటుంబంపై మకిలి జల్లడం అత్యంత హేయమైన చర్యగా భావించి అమరవీరుల స్థూపాన్ని పసుపునీళ్లతో శుద్ధి చేసి పాలాభిషేకం చేశారు.

కేసీఆర్ కుటుంబంపై నోరు పారేసుకుంటే భవిష్యత్ లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అమరుల కుటుంబాలను ఆదుకున్నది, వారికి తగిన గుర్తింపునిచ్చింది కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణ అమరులు, ఉద్యమకారుల పట్ల అత్యంత నిబద్ధత కలిగిన నాయకుడు కేసీఆర్ మాత్రమేనని తేల్చిచెప్పారు. ఇవన్నీ గుర్తించకుండా అవాకులు చవాకులు పేలితే గతంలో మానుకోట జరిగిన ఘటన పునరావృతం అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శేషు, కృష్ణ, బొల్లు నాగరాజు, జంగయ్య మదన్,తరుణ్ సందీప్, కుమార్‌తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య భక్తులకు మరిన్ని సేవలు.. 74 ఆలయాల్లో పూజ సేవల విస్తరణ



హైదరాబాద్, డిసెంబర్ 3: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో భక్తుల కోరిక మేరకు ఆలయ పూజ సేవలను విస్తరించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శనివారం అరణ్య భవన్‌లో ఆలయ సేవల విస్తరణ, ఆన్ లైన్ సేవలు, కొత్తగా ధూప దీప నైవేద్య పథకం అమలు, దేవాదాయ శాఖ భూముల గెజిట్ నోటిఫికేషన్, తదితర అంశాలపై మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ఆలయ సేవల విస్తరణ, భక్తులకు మెరుగైన సేవలపై చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీవైష్ణవ, శివాలయాలు, అమ్మవార్ల దేవాలయాల్లో ఆగమ సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న పూజ సేవలను మిగితా దేవాలయాలకు విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కొన్ని దేవాలయాల్లో లేని పూజ సేవలను కొత్తగా భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. 74 ఆలయాల్లో డిసెంబర్ 10 లోగా ఈ సేవలను భక్తులకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఆయా ఆలయాల్లోని సేవలు, పూజల వివరాలను దేవాదాయ శాఖ వెబ్ సైట్ వనిటనీలిఎవనిబిబ.బిబ.నితిఇ.తిని/ లో భక్తులో కోసం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

## విశ్రాంత వ్యవసాయాధికారి దారుణహత్య..

అమరావతి: డిసెంబర్ 3: కర్నూల్ నగరంలోని.. మాధవి నగర్ లో విశ్రాంత వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం శర్మ దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్య ఘటనపై కర్నూలు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ హత్యలో కుటుంబ సభ్యులపైనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# జి20 లోగోను తయారు చేసిన నేత కార్మికుడిని సన్మానించిన గవర్నర్



హైదరాబాద్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జి20 లోగోను ను తయారు చేసిన సిరిసిల్ల నేత కార్మికుడు వెల్ది హరి ప్రసాద్ రేఖ దంపతులను గవర్నర్ గారు రాజ్ భవన్ కు పిలిపించుకొని జ్ఞాపికను అందచేసి అభి నందించారు. లోగోను ఎలాంటి అతుకు లేకుండా చేనేత మగ్గంపై హరి ప్రసాద్ రేఖలు తయారు చేసారు.తరువాత ప్రసాద్ తను తయారు చేసిన అగ్గిపెట్టెలో ఇమిడే శాలువాతో గవర్నర్ గారిని సత్కరించి,బుల్లి చేనేత మొగ్గాన్ని జ్ఞాపిక గా అంద జేసారు. ఈ కార్య క్రమం లో ఆడే పూ రవీందర్ కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్, మున్సిపల్ మాజీ చైర్మన్,శీలం రాజు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు గాజుల వేణు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ మకుటవ నలగెడి శీలిన
చకితని భాషణాముల్లోడ చిద్రూపముల్లో
త్రకుటన లవదగు పాత్రకు
చకితని జీవమును బోసె జావేద్ జాఫ్రీ

(డిసెంబర్ 4 జావేద్ జాఫ్రీ పుట్టిన రోజు..)

-రాధశ్రీ
సెల్:9494481210



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

# అసమానతల విషవలయంలో భారతం

ప్రపంచ మానవాళికి పట్టిన చీడపీడలు పేదరిక అగచాట్లు. అనేక దేశాల్లో పేదరికమనే కారుచీకటి కమ్మేసింది. భారత దేశం ఎదుర్కొంటున్న పలు సమస్యల్లో పేదరికంతో పాటు అధిక జనాభా, నిరుద్యోగం, అనారోగ్యం, ఆహార అభద్రత లాంటివి అనాదిగా వెంటాడుతూనే ఉంటున్నాయి. భారతానికే సవాళుగా నిలిచిన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, లింగ అసమానతలు దేశాభివృద్ధికి ప్రతిబంధకాలుగా నిలుస్తున్నాయి. మన దేశ జనాభా అనుభవిస్తున్న ప్రధాన సమస్యగా 'ఆదాయ అసమానతలు (ఇన్‌కమ్ ఇనీక్వాలిటీస్)' గుర్తించబడినవి. వ్యక్తుల మధ్య సంపద, ఆదాయాల్లో అపారమైన తేడాలు ఉండడాన్ని ఆదాయ అసమానతలుగా గుర్తిస్తారు. ఆదాయ, సంపదల వ్యత్యాసాలు ఉన్న సమాజంలో అసంతృప్తులు, అశాంతి పెరుగుతాయి. ప్రపంచ సంపదలో 82 శాతం ఒక శాతం జనాభా చెంతనే ఉండగా, దాదాపు సగం జనాభా (370 కోట్లు) పేదరికంలో మగ్గుతున్నారని తేలింది. గత దశాబ్దంలో కుబేరుల ఆదాయం 6 రెట్లు పెరగగా, సాధారణ శ్రామికవర్గ ఆదాయం ఏటా 2 శాతం మాత్రమే పెరిగింది.

భారతదేశ సంపద:

ప్రపంచ బిలియనీర్ల జాబితాలో ఇండియా 3వ స్థానంలో (అమెరికా, చైనా తరువాత) ఉన్నది. అయినప్పటికీ భారత్‌లో కోవిడ్-19 కారణంగా 75 మిలియన్ల పేదలు అదనంగా పెరిగారు. ప్రపంచవ్యాప్తంగా 689 మిలియన్ల కడుపేదలు ఉండగా, ఇండియాలో వారి సంఖ్య 139 మిలియన్లు (20 శాతం) ఉన్నది. ప్రపంచ జనాభాలో 17.8 శాతం ఇండియన్లు ఉన్న విషయం మనకు తెలుసు. ఇండియాలో 2019 ఏడాదిలో 102 ముంది బిలియనీర్లు ఉండగా, 2020లో వారి సంఖ్య 140కి పెరిగి, వారి సంపద దాదాపు రెట్టింపు (596 బిలియన్ డాలర్లు) అయ్యింది. భారత దేశంలో 73 శాతం సంపద 1 శాతం జనాభా వద్దనే ఉన్నదని, 67 కోట్ల భారతీయులు (దాదాపు 50 శాతం) పేదరికంలో ముగ్గుతున్నారని సర్వే ఫలితాలు వివరిస్తున్నాయి. ప్రపంచ ఇనీక్వాలిటీ ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం 1980ల్లో చేపట్టిన ఆర్థిక సరళీకరణ విధానం అనంతరం అత్యధిక జనాభా కలిగిన ఇండియా, చైనాల్లో ఆదాయ అసమానతలు క్రమంగా పెరిగాయని విశ్లేషించారు. 1980ల్లో ధనికుల ఆదాయం 30 శాతం, 2019లో 56 శాతం వృద్ధి కావడం గమనించారు. కులమత వివక్షల కారణంగా భారతదేశంలో ఆదాయ అసమానతలు పెరుగుతున్నాయని నిర్ధారించారు. మన దేశంలోన 22.3 శాతం హిందువుల వద్ద 47 శాతం దేశ సంపద ఉందని, 7.8 శాతం ఉన్న హిందూ యస్‌టీ వర్గం వద్ద 3.7 శాతం సంపద మాత్రమే ఉందని తేలింది. మన దేశంలోని మహారాష్ట్ర, యూపీ, కేరళ, తమిళనాడు, హర్యానా రాష్ట్రాల్లోనే 50 శాతం వరకు సంపద దాగి ఉందని వివరిస్తున్నారు.

ఆదాయ అసమానతలకు కారణాలు:

ఆదాయ అసమానతలు మె?గ్గలు తొడగడానికి ముఖ్య కారణంగా నిరుద్యోగం, అండర్‌ఎంప్లాయ్‌మెంట్ సమస్యలను తొలుత గుర్తించారు. అర్హతకు తగిన ఉద్యోగం లభిస్తేనే ఆదాయాలు పెరుగుతూ, అసమానతలు తగ్గుతూ, క్రియాశీలతలు/ఉత్పత్తులు/సాఫల్యతలు పెరుగుతాయి. శ్రమ దోపిడీతో ఆదాయాలు, నిరుపేదల శరీరాలు కుంచించుకు పోవడం చూస్తున్నాం. పేదరికం, నిరుద్యోగం, అసమానతలు విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఉద్యోగాల కల్పన, పనికి తగ్గ వేతనాలు దొరికితేనే ఆదాయ అసమానతలు తగ్గుతాయని గమనించాలి. పారిశ్రామిక, వ్యవసాయ లాభాలు, ఆదాయాలు తగ్గితే శ్రామికులు/దినసరి కూలీలకు ఆదాయాల్లో భారీ కోతలు విధించబడతాయని తెలుసు కోవాలి. ఒక వేళ లాభాలు పెరిగినా ఉద్యోగులు/శ్రామిక వర్గాల వేతనాలు పెరగడంలేదు. కుబేరులు ఆదాయాలకు తగిన పన్నులు కట్టకుండా, దొడ్డి దారిన పన్నులను ఎగవేయడం పరిపాటిగా కనిపించడంతో ప్రభుత్వ ఆదాయాలకు గండి పడడం, పేదలకు అభివృద్ధి ఫలాలు అందకపోవడం జరుగుతోంది.

ఆదాయ అసమానతల దుష్పరిణామాలు:

రాజ్యాంగం ప్రసాదించిన సామాజిక సమానత్వం, సమాన అవకాశాల కల్పన, సంపద సమానంగా పంపిణీ కావడం లాంటి హక్కులు నేటికీ కాగితాల్లోనే దాగి ఉన్నాయి. ప్రాంతీయ అసమానతలతో పాటు అవకాశాల్లో అసమానతలు దేశ సమాఖ్య స్ఫూర్తి పునాదులను బలహీనపరుస్తున్నాయి. ప్రభుత్వాలు సామాజిక, ఆర్థిక సమానత్వ సాధనకు భూసంస్కరణలు, సామాజిక భద్రత, పెన్షన్లు, నైపుణ్య శిక్షణల వంటి తగు పటిష్ట చర్యలను తీసుకోవాలి. అత్యంత కుబేరుల(సూపర్ రిచ్)కు రాయితీల రూపంలో కొమ్ముకాయకుండా, వారి సంపద నుంచి అధిక అనువంశిక పన్నులను విధించాలి. పారిశ్రామిక, ఔత్సాహిక వర్గాలను చేయూతను ఇవ్వడం, పన్నుల వసూళ్లను అమలు పరచడం జరగాలి. అదాని, అంబానీ లాంటి పారిశ్రామిక కుబేరుల చేతుల్లో ప్రభుత్వాలు కీలు బొమ్మలు కావడం అసమానతల పోషణకు ఆజ్యం పోస్తూనే ఆదాయాలు పెంచుకోవడం, వ్యయాలు తగ్గించుకోవడం, లాభాలు పొందడం సంపన్నులకు సర్వసాధారణం అవుతున్నది.

ఆదాయ అసమానతల తగ్గింపు మార్గాలు:

ప్రభుత్వాలు తమ పాలసీలను అమలు పరచడంతో పాటు కుబేరుల నుంచి ఆదాయ పన్ను చట్టాల ప్రకారం వసూలు చేయడంలో కఠినంగా వ్యవహరించాలి. విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జోడెడ్లలా సమన్వయంతో పని చేయాలేగాని, రైలు పట్టాల్లా సమాంతరంగా పని చేయకూడదని తెలుసుకోవాలి. ఆదాయ అసమానతలను రూపుమాపడానికి అన్ని వర్గాల ప్రజలకు కావలసిన పాలసీలను 'నీతి ఆయోగ్' తీసుకురావడానికి చొరవ చూపాల్సి ఉంది. నిరుపేద వర్గాలకు పని కల్పన, పనికి తగిన ఆకర్షణీయ వేతనాలు, అన్ని వర్గాల సమాంతర సుస్థిరాభివృద్ధి సత్వరమే జరగాలి. ఆర్థిక, ఆదాయ సమానత్వ సాధనలో దేశ ప్రజలందరూ తమ తమ హక్కులతో పాటు బాధ్యతలను నిర్వహించాలి. ఆదాయ అసమానతలు భరతజాతికి పట్టిన చీడపీడలని, వాటి నిర్మూలనకు బహుముఖీన కోణాల్లో పని చేయాల్సి ఉందని గుర్తుంచుకోవాలి.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# అయ్యప్పపడిపూజలో పొంగులేటి



ఖమ్మం, డిసెంబర్ 3 : (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలోని కొత్తగూడెం గ్రామంలో శనివారం జరిగిన అయ్యప్ప పడిపూజ మహోత్సవంలో తెరాస రాష్ట్ర నాయకులు, ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అయ్యప్పస్వాములందరితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వాములందరూ కలిసి పొంగులేటిని ఘనంగా సత్కారించారు. అదేవిధంగా ముస్తఫానగర్ లో శ్రీ దివ్యమణికంఠ అన్నదాన సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాపడిపూజలోనూ ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ పర్యటనలో పొంగులేటి వెంట తెరాస రాష్ట్ర నాయకురాలు మద్దినేని బేబి స్వర్ణకుమారి, కార్పొరేటర్లు దొడ్డా నగేష్, మలీదు జగన్, చేతుల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# విశాఖవేదికగా జాతీయ నౌకాదళ ఉత్సవాలు



న్యూఢిల్లీ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఏటా దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా జరిగే జాతీయ నౌకాదళ ఉత్సవాలకు ఈసారి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఆతిథ్యం ఇస్తున్నది. దీంతో ఢిల్లీలో కాకుండా ఇతర ప్రాంతాల్లో నేవీ డే వేడుకలు జరుగడం ఇదే మొదటిసారి. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో విజయానికి గుర్తుంగా ఏటా డిసెంబర్ 4 నేవీ డేగా నిర్వహిస్తున్నది. ప్రతి సంవత్సరం న్యూఢిల్లీలో త్రివిధ దళాధిపతి అయిన భారత రాష్ట్రపతి సమక్షంలో వేడులను నిర్వహిస్తారు. అయితే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 'ఆజాదీ కా అమృత్' మహోత్సవాలను నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా పాక్‌పై విజయంలో కీలకపాత్ర పోషించిన తూర్పు నావికా దళానికి కేంద్రమైన విశాఖలో ఈ వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఉత్సవాలకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, పలువురు కేంద్ర మంత్రులు, సైనిక ఉన్నతాధి, కాంంలం హాజరుకానున్నారు. 1971 డిసెంబర్ 4 న అందరి అంచనాలను తలకిందులు చేసన్తూ భారత నావికాదళం పాకిస్తాన్‌లోని కరాచీ పోర్టుపైన మెరుపుదాడి చేసింది. నాలుగు యుద్ధ నౌకలను ధ్వంసం చేసి, బంగాళాఖాతంలో ప్రాదేశిక ప్రాంతాలను నేవీ తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు భారత వైమానిక దళం దాదాపు 4000 యుద్ధ వాహనాలతో పాకిస్తాన్ ఎయిర్ ఫోర్స్‌ను కలావికలం చేసింది. భారత సైన్యం ముందు పాక్ ఎత్తులు నిలవలేక 15 రోజుల్లోనే డిసెంబర్ 16 న పూర్తిగా భారత దళాలకు లొంగిపోయింది. ఈ విజయానికి గుర్తుగా ఏటా డిసెంబరు 4న నేవీ డే జరుపుకుంటున్నారు. ఏటా ఈ రోజునే నేవీ డేగా దేశంలోని నావికాదళ కమాండ్స్ నిర్వహిస్తున్నాయి. రక్షణ దళంలోని త్రివిధ దళాలు అత్యంత ఘనకీర్తిని ఇనుమడింపజేసే కార్యక్రమాలతో ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిసన్తూ వస్తున్నారు.

# కాసోజు శ్రీకాంత్ చారికి నివాళులర్పించిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా



హైదరాబాద్, డిసెంబర్ 3: మలిదశ తెలంగాణ ఉద్యమ నేత కాసోజు శ్రీకాంత్ చారికి టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా నివాళులర్పించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి విద్యార్థి అమరుడు తన అమరత్వంతో యావత్ తెలంగాణలో రాష్ట్ర సాధనకై ముందడుగు వేసిన విద్యార్థి కీ.శే. కాసోజు శ్రీకాంత్ చారి 13వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లోని ఎల్.బి.నగర్ లో విశ్వ బ్రాహ్మణ మనుమయ సంఘం-ఎల్.బి.నగర్ డివిజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో కీ.శే. కాసోజు శ్రీకాంత్ చారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో.. సల్వ చారి, వెంకటేశ్వరాచారి, ఆందోల్ చారి, వెంకటాచారి శేఖరాచారి, రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

# ఐపీ దరఖాస్తుదారుల సమస్యల పరిష్కారానికి ప్రతిరోజూ బహిరంగ సదస్సు

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: దేశంలో మేధో సంపత్తి వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్న లక్ష్యంతో 2022 అక్టోబర్ 17వ తేదీ నుంచి ఐపీ దరఖాస్తుదారుల సమస్యల పరిష్కారానికి ప్రతిరోజూ ఆఫీస్ ఆఫ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్ డిజైన్స్ అండ్ ట్రేడ్‌మార్క్స్ (అఉఖఆఓ)బహిరంగ సదస్సు నిర్వహిస్తోంది.

ఐపీ కార్యాలయాన్ని సందర్శించకుండా సమస్యకు పరిష్కారం పొందే అవకాశం అందుబాటులోకి తీసుకుని రావాలన్న లక్ష్యంతో బహిరంగ సదస్సు విధానానికి ఆఫీస్ ఆఫ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్ డిజైన్స్ అండ్ ట్రేడ్‌మార్క్స్ శ్రీకారం చుట్టింది. సంబంధిత వర్గాల సమస్యలు, అనుమానాలను ఐపీవో అధికారులు వర్చువల్ విధానంలో పరిష్కరిస్తారు. దేనివల్ల ఐపీ దరఖాస్తుల పరిష్కారం వేగంగా జరుగుతుంది.

2022 అక్టోబర్ 17 నుంచి అన్ని పని దినాలలో ఉదయం 10.30 నుంచి 11.30 వరకు బహిరంగ సదస్సు నిర్వహించబడుతోంది. సదస్సు ప్రారంభ కార్యక్రమంలో దేశం వివిధ ప్రాంతాలకు చెందిన 104 మంది వాటాదారులు పాల్గొన్నారు. పేటెంట్‌లు, డిజైన్‌లు, ట్రేడ్‌మార్క్‌లు మరియు కాపీరైట్‌ల రంగాలలో తలెత్తుతున్న సమస్యలను, సమస్యల పరిష్కరించడానికి గల మార్గాలను సదస్సులో దరఖాస్తుదారులు ప్రస్తావిస్తున్నారు. తమ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి అధికారులు సదస్సులో సలహాలు, సూచనలు అందిస్తారు. ప్రతిరోజూ నిర్వహిస్తున్న కార్యక్రమంలో పలువురు హాజరవుతున్నారు. దరఖాస్తుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడంలో కార్యాలయంలో జరుగుతున్న విపరీతమైన జాప్యానికి సంబంధించిన సమస్యలు ప్రస్తావిస్తున్నారు. సమస్యను లేవనెత్తిన తేదీ నుంచి నిర్దిష్ట కాలపరిమితితో పరిష్కరించబడతాయి.

బహిరంగ సదస్సు నిర్వహించిన వాటాదారులు అందించిన సమాచారం, వివరాల ఆధారంగా, భారత ఐపీ ఆఫీస్ ట్రేడ్ మార్క్స్ షో కాజ్ హియరింగ్‌ల కోసం "డైనమిక్ కాజ్ లిస్ట్" వ్యవస్థను 1 డిసెంబర్ 2022 నుంచి అమల్లోకి తెచ్చింది, దీనిలో ఆన్‌లైన్ లో సమస్యలను వివరించడానికి వెబ్‌సైట్ లో ఒక లింక్ కూడా అందుబాటులో ఉంటుంది.

# ఆ దేశం లో పెళ్లికి ముందు రొమాన్స్..సెక్సుతో పాటు సహజీవనం నిషేదం

**-ఏ నిబంధనను ఉల్లంఘిస్తే ఏడాది పాటు జైలు.. లేదంటే భారీ జరిమానా**

**-ఏ ఈ దిశగా కొత్త చట్టాన్ని తీసుకొచ్చే ప్రయతనానికి సిద్ధమైన ఇండోనేషియా**

-న్యూ డిల్లీ (ఎక్స్ ప్రెస్ న్యూస్ );టూరిజం కేంద్రంగా ఇప్పుడిప్పుడే పెద్ద ఎత్తున డెవలప్ అవుతోన్నఇండోనేషియాలో కొత్త చట్టం దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటివరకు లేని విధంగా కొత్త చట్టంలోని అంశాలు ఉండనున్నాయి. ఇకపై.. పెళ్లికి ముందు రొమాన్స్.. సెక్సుతో పాటు సహజీవనాన్ని నిషేధించేందుకు ఆ దేశం సిద్ధమైంది. ఒకవేళ తాము తీసుకొచ్చిన నిబంధనను ఉల్లంఘిస్తే ఏడాది పాటు జైలు.. లేదంటే భారీ జరిమానాను విధించాలని నిర్ణయించారు. ఈ దిశగా కొత్త చట్టాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.దీనికి సంబంధించిన క్రిమినల్ కోడ్ ముసాయిదాను పార్లమెంటులో ప్రవేశ పెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. పెళ్లికి ముందు సెక్సు చేయటం.. సహజీవనం చేయటం నిషేధం. ఒకవేళ భర్త లేని వారు.. భార్య లేని వారు ఎవరితోనైనా సెక్సు చేస్తే ఆ చర్యను వ్యభిచారం కింద శిక్షిస్తారని స్పష్టం చేస్తునరు. కేటగిరి 2 కింద గరిష్ఠంగా ఏడాది పాటు జైలు ఖాయమని స్పష్టం చేస్తున్నారు. ఈ చట్టం ఇండోనేషియా ప్రజలు మాత్రమే కాదు విదేశీయులకు కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయని చెబుతున్నారు. ఇండోనేషియా విలువలకు తగ్గట్లుగా కొత్త చట్టం ఉంటుందని చెబుతున్నారు.మన దేశంతో పాటు వేర్వేరు దేశాల నుంచి టూరిజంలో భాగంగా పెద్ద ఎత్తున విదేశీయులు ఆ దేశానికి వెళతారు. అలాంటి వేళ.. ఈ కొత్త చట్టం గురించి అవగాహన లేని పక్షంలో ఇబ్బందుల్లో ఇరుక్కోవటంతో పాటు.. కేసుల బారిన పడే ప్రమాదం ఉంది. ప్రపంచంలోనే అత్యధిక ముస్లిం జనాభా ఉన్న దేశంలో మహిళలు.. మతపరమైన మైనార్టీలు.. స్వలింగ సంపర్కం మీద ఎన్నో ఆంక్షల్ని విధిస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటివేళ.. తాజాగా తెస్తున్న చట్టం కొత్త పరిమితులకు తెర తీస్తుందని చెప్పక తప్పదు.

# రికార్డు సృష్టిస్తోన్న.. తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం

తిరుపతి, డిసెంబర్ 3: తొమ్మిదో నెల తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం 100కోట్ల రూపాయలు దాటడం విశేషం. ఈ వార్షిక సంవత్సరంలో అంటే మార్చి 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు హుండీ ద్వారా రూ. 1000 కోట్ల ఆదాయం వస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానం అంచనా వేసింది. ఇప్పుడు అంచనాలకు మించి ఆదాయం వచ్చి పడుతోంది. మార్చి నుంచి నవంబరు వరకు ప్రతి నెల రూ. 100 కోట్లకుపైగా ఆదాయం హుండీ ద్వారా సమకూరుతోంది. గత 8 నెలల్లో రూ. 1,164 కోట్ల ఆదాయం రాగా, నవంబరులో ఏకంగా రూ. 127.30 కోట్ల ఆదాయం వచ్చింది.

ఫలితంగా టీటీడీ వార్షిక ఆదాయ అంచనాను దాటేసింది. దీంతో టీటీడీ తన అంచనాలను సవరించింది. ఈ వార్షిక సంవత్సరంలో రూ. 1600 కోట్లకు పైగా హుండీ ఆదాయం వస్తుందని భావిస్తోంది. 1950 వరకు శ్రీవారికి హుండీ ద్వారా రోజుకు లక్ష రూపాయల లోపు ఆదాయం లభించేది. 1958లో తొలిసారి లక్ష దాటింది. 1990ల నాటికి అది కోటి రూపాయలకు పెరగ్గా, ఆ తర్వాతి నుంచి క్రమంగా పెరిగింది. 2020-21లో రూ. 731 కోట్ల వార్షిక ఆదాయం రాగా, గత ఆర్థిక సంవత్సరంలో అది మరింత పెరిగి రూ. 933 కోట్లకు పెరిగింది. దీంతో ఈ వార్షిక ఏడాదిలో అది రూ. 1000 కోట్లు అవుతుందని అంచనా వేయగా, మూడు నెలల ముందే ఆ అంచనా దాటిపోయింది. దీంతో ఈసారి హుండీ ఆదాయం రూ. 1600 కోట్లు వచ్చే అవకాశం ఉందని తాజాగా అంచనా వేశారు.

# ప్యాసెంజర్ విభాగంలో 76% పెరిగిన రైల్వేల ఆదాయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: భారతీయ రైల్వేలు మూలాధార ఆధారంగా ఏప్రిల్ నుంచి నవంబర్ 2022 వరకు మొత్తం రూ. 43324 కోట్లను ఆదాయాన్ని గడించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ. 24631 కోట్లతో పోలిస్తే 76 శాతం ఎక్కువ. రిజర్వ్‌డ్ ప్యాసెంజర్ వర్గంలో, 1 ఏప్రిల్ నుంచి 30 నవంబర్ 2022 మొత్తం బుక్ చేసున్న మొత్తం ప్యాసెంజర్ల సంఖ్య 5365 లక్షలు. కాగా గత ఏడాది 4860 లక్షలతో పోలిస్తే ఇది10% ఎక్కువ. రిజర్వ్‌డ్ ప్యాసెంజర్ వర్గం నుంచి 1 ఏప్రిల్ నుంచి 30 నవంబర్ 2022 వరకు వచ్చిన ఆదాయం రూ. 34303 కోట్లు. ఇది గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ. 22904 కోట్లతో పోలిస్తే 50% ఎక్కువ. అన్‌రిజర్వ్‌డ్ ప్యాసెంజర్ సెగ్మెంట్‌లో 1 ఏప్రిల్ నుంచి 30 నవంబర్ 2022 కాలానికి బుక్ చేసుకున్న మొత్తం ప్యాసెంజర్ల సంఖ్య 35273 లక్షలు. గత ఏడాది ఇదే కాలంలో బుక్ చేసుకున్న ప్యాసెంజర్ల సంఖ్య 13813. ఇది 155% పెరుగుదల. అన్‌రిజర్వ్‌డ్ ప్యాసెంజర్ సెగ్మెంట్‌లో 1 ఏప్రిల్ నుంచి 30 నవంబర్ 2022 వరకు ఆర్జించిన ఆదాయం రూ. 9021 కోట్లు. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ. 1728 కోట్లతో పోలిస్తే 422% పెరుగుదల.




# పులివెందుల పర్యటనలో జగన్.. తన పీఏ కుమార్తె పెళ్లికి హాజరైన సీఎం దంపతులు

అమరావతి: డిసెంబర్ 3: పులివెందుల పర్యటనలో ఉన్నారు ఏపీ సీఎం జగన్. ఈ పర్యటనలో ఆయన తన పీఏ రవిశేఖర్ యాదవ్ కుమార్తె హేమలత వివాహానికి హాజరయ్యారు. ఇడుపులపాయ నుంచి హెలికాప్టర్ లో సతీసమేతంగా బయల్దేరిన సీఎం జగన్ పులివెందులలోని భాకరాపురం చేరుకున్నారు. అక్కడ్నుంచి రోడ్డుమార్గంలో కదిరి రోడ్డులో ఉన్న ఎస్సీఎస్సార్ గార్డెన్స్ లో జరుగుతున్న పెళ్లికి హాజరయ్యారు. వధూవరులు హేమలత, గంగాధర్ లకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారికి ఆశీస్సులు అందించారు. అంతకుముందు పెళ్లిమంటపం వద్ద సీఎం జగన్, వైఎస్ భారతిలకు సంప్రదాయబద్ధంగా స్వాగతం లభించింది. సీఎం రాకతో పెళ్లి వేదిక వద్ద భారీ కోలాహలం నెలకొంది. ఈ పెళ్లికి ఏపీ మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు కూడా హాజరయ్యారు.

# ఏ సమస్యనైనా చిరునవ్వుతో ధైర్యంగా ఎదుర్కొనే వారు మీరే




మెదక్, డిసెంబర్ 3: నేటినిజం (ప్రతినిధి):దివ్యాంగులైన వారు ఎంతో ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తారని, వికలాంగత్వం మీకు కాదని అంతా మాకు తెలుసన్న వారికని, నిజ జీవితంలో సకలాంగులకన్నా మీరే హీరోలని మెదక్ జిల్లా జూనియర్ సివిల్ జడ్జి రీటా లాల్ చంద్ అన్నారు. ఏ సమస్యనైనా చిరునవ్వుతో ధైర్యంగా ఎదుర్కొంటారని మీరే మాకు స్ఫూర్తి అని అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక బోధన్ చౌరస్తా నుండి ఇందిరా గాంధీ స్టేడియం వరకు నిర్వహించిన దివ్యాంగుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్టేడియం లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులకు చిన్నచూపు ఉందని, అంటరాని వారీగా చూస్తున్నారని కొన్ని దివ్యాంగ సంఘాల ప్రతినిధులు తమ ఉపన్యాసంలో ప్రస్తావించిన విషయాలను గుర్తు చేస్తూ దేవుడు మీకు అపారమైన శక్తి ఇచ్చాడని, ఎవరేమనుకున్నా అనుకున్న లక్ష్య సాధన దిశగా ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని విజయం వరిస్తుందని అన్నారు. పరిపాలన సంబంధమైన మీ సమస్యలను అధికారులు పరిష్కరిస్తారని, న్యాయపరమైన సమస్యలు ఏమైనా ఉంటె జిల్లా న్యాయ సేవా సమితిని సంప్రదించి తెల్ల కాగితంపై దరఖాస్తు ఇస్తే ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామన్నారు. వికలాంగత్వాన్ని జయించి ఎంతో ఉన్నత శిఖరాలు అధిరోహించావారున్నారని, అదే స్ఫూర్తి, పట్టుదలతో ముందుకెళ్లాలని మీలో కూడా కోరిక ఉంటుందని, ఆ కోరిక నెరవేర్చుకోవడానికి కష్టపడాలని, అందుకు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ దివ్యాంగుల, వయోవృద్ధులు, , ట్రాన్స్ జెండర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేస్తూ జి.ఓ. జారీచేసిందన్నారు. గతంలో మహిళా శిశు సంక్షేమ శాఖలో విలీనమైన వికలాంగుల వయోవృద్ధుల శాఖ ద్వారా భిన్న పథకాల అమలులో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వారికి మరింత మెరుగైన సేవలు , సంక్షేమ కార్యక్రమాలు దరిచేరాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేక శాఖను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. తద్వారా ప్రత్యేక సిబ్బంది ఉంటారని, మీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుటకు అవకాశముంటుందని అన్నారు. 2016 చట్టం ద్వారా వికలాంగుల కోసం ఉన్న హక్కులపై శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కలిగిస్తామని అన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వికలాంగులలో పట్టుదల, ఆత్మ విశ్వాసం మెండుగా ఉంటుందని, ఏ సమస్య వచ్చిన ఎవరిపై ఆధారపడకుండా ధైర్యంగా ఎదుర్కొంటు ముందుకెళతారని ప్రశంసించారు. మహిళాశిశు , వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమాధికారి బ్రహ్మాజీ మాట్లాడుతూ జిల్లాలో 12,986 మంది దివ్యాంగులున్నారని, వారి సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు పరుస్తున్నామని అన్నారు అవసరమైన వారికి ఆలింకో సంస్థ ద్వారా వీల్ ఛైర్లు, కృత్రిమ అవయవాలు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు వంటివి అందిస్తున్నామన్నారు. కులాంతర వివాహక ప్రోత్సాహకాలు, బ్యాంక్ లింకేజి, రాయితీపై బస్సు పాస్ సౌకర్యం కలిస్తున్నామని అన్నారు. డిఆర్ డిఓ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 8,734 మంది దివ్యాంగులకు ప్రతి నెల ఆసరా పింఛన్లు అందిస్తున్నామని అన్నారు. ఈ సంవత్సరంలో 24 సదరం క్యాంపులు నిర్వహించి 1410 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అర్హులైన 540 మందికి వికలాంగత్వ సర్టిఫికెట్ లను అందించామన్నారు. ఉపాధి హామీ పథకం క్రింద 1,532 వికలాంగులకు జాబ్ కార్డులు అందించి 38 వేల పనిదినాలు కల్పించామన్నారు. వివిధ వృత్తులలో వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నామన్నారు. మనం అనుభవిస్తున్న ఫలాలను తోటి వారందరికీ అందేలా చూడాలని వికలాంగులకు సూచించారు. అనంతరం రాష్ర స్థాయిలో జరిగిన పరుగు, జావెలిన్ త్రో లో గెలుపొందిన కవిత, ప్రసాద్, ట్రై సైకిల్ రేస్ లో విజేత యాదగిరి నవీన్ లకు అదనపు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో జరిగిన పరుగు పందెం, షాట్ పుట్, ట్రై సైకిల్ రేస్, జావెలిన్ త్రో, చెస్, క్యారం వంటి ఆటల పోటీలలో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ విజేతలకు ప్రశంసాపత్రం, బహుమతులను అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ సైదులు, డీఈఓ రమేష్ కుమార్, జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజ్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇందిరా, వివిధ దివ్యంగుల సంఘాల నాయకులు అశోక్, స్వామి, రియాజుద్దీన్, సాయిలు, యాదయ్య, సంతోషి, సి.డి.పి .ఓ.లు, ఎపిఎం లు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మకర్తల మండలి నియామకాల కోసం దరఖాస్తులు

మెదక్, డిసెంబర్ 3: నేటినిజం (ప్రతినిధి):మెదక్ జిల్లాలోని (11) దేవాలయాలకు ధర్మకర్తల మండలి నియామకాల కోసం దరఖాస్తులు ఆవహానిస్తున్నామని దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామాయంపేట లోని మహంకాళి దేవాలయం, శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం, రామాయంపేట మండలం చెల్మెడ లోని శ్రీ తిరుమలనాథ వెంక టేశ్వర స్వామి దేవాలయం, హవేళిఘనాపూర్ మండలం తొగిట లోని శ్రీ రామాలయం, శివ్వంపేట మండలం దొంతిలోని శ్రీ వేణు గోపాల స్వామి దేవాలయం, కొల్చారం మండలం కిష్టాపూర్ లోని శ్రీ రామాలయం, నర్సాపూర్ లోని శ్రీ లక్ష్మి నారాయణ స్వామి దేవాలయం, రామాయంపేట మండలం రైలాపూర్ లోని శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవాలయం, తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ లోని శ్రీ రామప్ప స్వామి దేవాలయం, హవేళిఘనాపూర్ మండలాల ముత్తాయికోట లోని శ్రీ సిద్దేశ్వర స్వామి దేవాలయాలకు ధర్మకర్తల మండలి నియామకాలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఫారం-2 లో ఈనెల 20 లోగా హైదరాబాద్ లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్/ ఉప కమిషనర్ కు ధరఖాస్తు చేసుకోవలసిందిగా ఆయన సూచించారు. వివరాలకు సంగారెడ్డిలోని తమ కార్యాలయంలో సంప్రదించవలసినదిగా సుధాకర్ సూచించారు.

# వేగంగా వృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ

## - స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తాజా నివేదిక

న్యూ ఢిల్లీ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భారత ఆర్థిక వ్యవస్థ




2022?23 ఆర్థిక సంవత్సరంలో ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో వేగంగా వృద్ధి చెందుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తాజా నివేదిక తెలిపింది. 2023 మొదటి త్రైమాసికంలో భారత స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) 13.5% వృద్ధితో ఉంటుందని వెల్లడించింది.

వాస్తవానికి 2029 నాటికి భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని ఎస్బీఐ అంచనా వేసింది. 2014 నుండి భారత్ 7 స్థానాలు పైకి ఎగబాకిందని గుర్తు చేసింది. ప్రస్తుత భారత్ వృద్ధిరేటు ప్రకారం 2027లో జర్మనీని 2029 నాటికి జపాన్ను భారత్ అధిగమిస్తుందని ఎస్బీఐ వెల్లడించింది.

ఇది ఏ ప్రమాణాల ప్రకారం చూసినా చెప్పుకోదగ్గ విజయమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రూప్ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అన్నారు. భారతదేశ వృద్ధిరేటు అంచనాలు ప్రస్తుతం 6.7 శాతం నుంచి 7.7 శాతం వరకు ఉన్నాయని ఎస్బీఐ ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. అనిశ్చితితో కూడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఈ వృద్ధిరేటును భారత్ నమోదు చేస్తుండటం గొప్ప విషయమని ఎస్బీఐ పేర్కొంది. కోవిడ్ తదనంతర పరిస్థితులు రష్యా?ఉక్రెయిన్ యుద్ధ ప్రభావాలు ఆర్థిక మాంద్యం పరిస్థితులతో ప్రపంచ దేశాల్లో వృద్ధిరేటు తగ్గుముఖం పడుతుందని ఎస్బీఐ అంచనా వేసింది. మరోవైపు ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు కూడా ఉద్యోగులను భారీ స్థాయిలో తొలగిస్తుండటంతో అనిశ్చితి నెలకొందని పేర్కొంది. అయితే భారత్ వృద్ధిరేటు మాత్రం ఇలాంటి పరిస్థితుల్లోనూ పురోగమిస్తుందని అంచనా వేసింది. రూపాయిని ప్రతిపాదికన పరిగణించి.. భారతదేశం అమెరికా జర్మనీల జీవన వ్యయాన్ని ఎస్బీఐ పోల్చింది. ఈ క్రమంలో గతేడాది సెప్టెంబర్లో ఆహార పదార్థాల ధరలను ఎస్బీఐ పోల్చిచూసింది. రూ. 100కు లభించే ఆహారవస్తువులు అమెరికాలో రూ. 28 యూకేలో రూ. 18 జర్మనీలో రూ. 33 చొప్పున ప్రస్తుతం పెరిగాయి. అదే మన భారత్లో చూస్తే రూ. 15 మాత్రమే ఆహార పదార్థాల ధరలు పెరిగాయని ఎస్బీఐ తెలిపింది. ఇక ఇంధన ధరలు అమెరికాలో రూ. 12 భారత్లో రూ. 16 పెరగగా జర్మనీ యూకేల్లో భారీగా పెరిగాయి. యూకేలో రూ. 93 జర్మనీలో రూ. 62 పెరగడం గమనార్హం. జీవన వ్యయం సైతం అమెరికా బ్రిటన్ జర్మనీ దేశాలతో పోలిస్తే భారత్లోనే తక్కువ ఉందని ఎస్బీఐ నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో తక్కిన దేశాలతో పోలిస్తే భారత్లో వృద్ధి సాధ్యమని చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనిశ్చితి ఆర్థిక మాంద్యం తదితరాలు భారత్ వృద్ధిని భంగపరచలేవని పేర్కొంది.

# ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి.. ఎమ్మెల్యే దాసరి



కరీంనగర్, డిసెంబర్ 3: పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.

శనివారం స్వచ్ఛ సర్వేక్షన్ 2022-23లో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతా రెడ్డితో కలిసి పెద్దపల్లి పట్టణంలోని 3వ వార్డులో ప్లాస్టిక్పై సమరం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వయంగా ఖాళీ ప్రదేశాల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా తొలగించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మన చుట్టుపక్కల పరిసరాలు బాగున్నప్పుడే మన ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఇందుకోసం పెద్దపల్లి పట్టణ ప్రజలు ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. చెత్తను బయట మురికి కాలువలో కానీ రోడ్ల పై కానీ, ఖాళీ ప్రదేశాల్లో వేయరాదన్నారు.

ప్రతిరోజూ ఉదయం మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి అందించి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. అలాగే ప్లాస్టిక్ కవర్ల వాడకం పూర్తిగా పెద్దపల్లిలో నిషేధించామని, బయటకు వెళ్లే సమయంలో ఇంట్లో నుండి బట్ట సంచులు వెంట తీసుకెళ్లాలని కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మట్ట శ్రీనివాస్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ లైసెట్టి బిక్షపతి, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, వార్డు కమిటీ- సభ్యులు, కమిటీ- యూత్ సభ్యులు, స్వచ్ఛంద సభ్యులు రాజ్ కుమార్, వెన్నం రవీందర్, మహిళలు, లయన్స్ క్లబ్ ఎలైట్ సభ్యులు, ఐటిఐ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో రిజర్వేషన్లు 76 శాతానికి పెంపు

## -సుదీర్ఘ చర్చ అనంతరం శాసన సభ ఆమోదం

న్యూఢిల్లీ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : జనాభా దామాషా ప్రకారం వివిధ వర్గాలకు ప్రభుత్వోద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాలను కల్పించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులను ఛత్తీస్‌గఢ్ శాసన సభ ఆమోదించింది. ఈ బిల్లుల ప్రకారం రాష్ట్రంలోని షెడ్యూల్డు తెగలకు 32 శాతం, ఇతర వెనుకబడిన వర్గాలకు 27 శాతం, షెడ్యూల్డు కులాలకు 13 శాతం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 4 శాతం రిజర్వేషన్లు లభిస్తాయి.

ఛత్తీస్‌గఢ్ పబ్లిక్ సర్వీస్ (షెడ్యూల్డ్ కేస్ట్, షెడ్యూల్డ్ ట్రైబ్స్ అండ్ అదర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ రిజర్వేషన్) అమెండ్‌మెంట్ బిల్లు, ఛత్తీస్‌గఢ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (రిజర్వేషన్ ఇన్ అడ్మిషన్) అమెండ్‌మెంట్ బిల్లులను ముఖ్యమంత్రి భూపేష్ బాఘెల్ శాసన సభలో ప్రవేశపెట్టారు. సుమారు 5 గంటల చర్చ అనంతరం ఈ బిల్లులకు శాసన సభ ఆమోదం లభించింది. ఈ బిల్లులపై చర్చకు బాఘెల్ సమాధానం చెప్తూ, రాష్ట్రంలోని ఓబీసీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారి సంఖ్యను నిర్దిష్టంగా తెలుసుకునేందుకు క్వాంటిఫయబుల్ డేటా కమిషన్‌ను గత బీజేపీ ప్రభుత్వాలు ఏర్పాటు చేయలేకపోయాయని ఆరోపించారు. తన ప్రభుత్వం 2019లో ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కోవిడ్-19 మహమ్మారి వల్ల ఈ కమిషన్ కార్యకలాపాలకు అంతరాయం కలిగిందన్నారు. ఈ నవరణలను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూలులో చేర్చాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరాలని అన్ని పార్టీల ఎమ్మెల్యేలను కోరానని చెప్పారు. శాసన సభ సభాపతి నేతృత్వంలో వెళ్లి మోదీని కలవాలని చెప్పానన్నారు. ఈ కమిషన్ నివేదిక ఇటీవలే ప్రభుత్వానికి అందింది. దీని ప్రకారం రాష్ట్ర జనాభాలో 42.41 శాతం ఓబీసీలు ఉన్నారు. 3.48 శాతం ఆర్థికంగా వెనుకబడినవారు ఉన్నారు.

శాసన సభలో ప్రతిపక్ష నేత నారాయణ్ చందేల్ మాట్లాడుతూ, క్వాంటిఫయబుల్ డేటా కమిషన్ నివేదికను శాసన సభలో ప్రవేశపెట్టలేదన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను కల్పించామని ప్రభుత్వం చెప్పుకుంటోందని, అయితే క్వాంటిఫయబుల్ డేటా కమిషన్ నివేదికను సభకు సమర్పించకపోవడం వల్ల సమాచారం నిర్దిష్టంగా లేదని పేర్కొన్నారు.

ఎస్సీలకు 16 శాతం, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీజేపీ ఎమ్మెల్యేలు ప్రతిపాదించారు. దీనికి ముఖ్యమంత్రి బాఘెల్ సమాధానం చెప్తూ, 2011 తర్వాత దేశంలో జనాభా లెక్కల సేకరణ జరగలేదని, ఈ ప్రక్రియ పూర్తయితే, దానికి అనుగుణంగా ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించవచ్చునని చెప్పారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో.. బయోమెట్రిక్ తప్పనిసరి



భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 3: వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని భద్రాద్రి కలెక్టర్ అనుదీప్ సూచించారు. ప్రతీ ఆసుపత్రి క్లీన్‌గా ఉండాలని, పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని ఆదేశించారు. వైద్యాధికారులతో కొత్తగూడెం కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12 నాటికి సీహెచ్‌సీల మరమ్మతుల పనులు. అశ్వారావుపేట ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అక్కడ కూడా టిఫ్సా, రేడియాలజీ సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. డీఎంఈ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, సూపరింటెండెంట్ కుమారస్వామి, డీసీహెచ్‌ఎస్ రవిబాబు, డీఎంహెచ్‌వో దయానందస్వామి పాల్గొన్నారు.

జిల్లాలో ఓటరు నమోదు, ఆధార్ అనుసంధానం ప్రక్రియ 78.34 శాతం జరిగినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ తెలిపారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై ముఖ్య ఎన్నికల అధికారి నితీశ్ ఢిల్లీ నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోఈ నెల 3, 4 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

అంగన్‌వాడీల్లో న్యూట్రీగార్డెన్లు..

ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రీగార్డెన్ ఉండాలని కలెక్టర్ అనదీప్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. డీడబ్ల్యూవో, సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యూట్రీగార్డెన్ వేసేందుకు నీటి సదుపాయం లేని అంగన్‌వాడీ కేంద్రాల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. రెండో దశలో కూడా జిల్లాలో 1,079 కేంద్రాల్లో చిరుధాన్యాల ఆహారం ఇవ్వాలని సూచించారు. ఇందుకోసం 14,667 మందిని గుర్తించినట్లు చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి..

అమరావతి: డిసెంబర్ 3: : నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో జరిగిన రోడ్డుప్రమాదంలో మహిళ మృతిచెందింది. స్కూటీ పై భర్త యువరాజుతో కలిసి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నాగమణి (25) అనే మహిళ మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# శీతాకాల సమావేశాలకు రాహుల్ దూరం.. రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఎవరన్నదానిపై ఉత్కంఠ..!

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: వచ్చే వారం నుంచి జరగబోయే పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దూరం కానున్నట్లు తెలుస్తోంది. రాహుల్‌తోపాటు పలువురు నాయకులు కూడా ఈ సమావేశాలకు గైర్హాజరవుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం రాహుల్ గాంధీ.. భారత్ జోడో యాత్రలో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ఈ యాత్రను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ? ప్రస్తుత పరిస్థితుల్లో యాత్రకే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇందులో భాగంగానే వీరంతా సమావేశాలకు దూరంగా ఉండి యాత్రను కొనసాగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా.. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 7వ తేదీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ(శనివారం) సాయంత్రం 4గంటలకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మక కమిటీ సమావేశం కానుంది. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టిన మల్లికార్జున ఖర్గే.. పోటీ చేసిన సమయంలో రాజ్యసభలో ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో రాజ్యసభలో తదుపరి కాంగ్రెస్ ప్రతిపక్ష నేత ఎవరు? అనేదానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో తాజా భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీలో రాజ్యసభలో ప్రతిపక్ష నేతను ఎన్నుకునే అవకశం ఉన్నట్లు తెలుస్తోంది.

# బాలికపై బాబాయి దారుణం



మహబూబ్‌నగర్, డిసెంబర్ 3: వరుసకు కూతురయ్యే అయ్యే బాలికపై బాబాయి లైంగిక దాడికి పాల్పడి ఆమెను హత్య చేసిన దారుణ ఘటన పాలమూరు జిల్లాలో చోటు చేసుకుంది. బాబాయితో పాటు అతడి ముగ్గురు స్నేహితులు సైతం లైంగిక దాడిలో పాల్గొనడంతో నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు శనివారం ధర్నా నిర్వహించారు.

బాలానగర్ మండలం తిరుమలగిరిలో పదో తరగతి చదువుతున్న 16 ఏళ్ల బాలిక తల్లిదండ్రులు బతుకుతెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లడంతో బాలిక ఇంట్లో ఒంటరిగా ఉంటూ చదువుకుంటుంది. ఈ క్రమంలోనే రాత్రి బాలిక బాబాయ్ శ్రీనివాస్, మరో ముగ్గురు ఆ ఇంటికి వెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆమె వారితో తీవ్రంగా ప్రతిఘటించడంతో హత్య చేసి ఆమెను ఫ్యాన్‌కు ఉరేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించినట్లు పోలీసులు భావిస్తున్నారు.

సమాచారం అందుకున్న జడ్చర్ల రూరల్ సీఐ జములప్ప ఆధ్వర్యంలో బాలానగర్ ఎస్సై జయప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిందితులలో ఇద్దరు పట్టుబడడంతో గ్రామస్తులు వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

# టికెట్లు ఉన్న వారికే వైకుంఠ ద్వార దర్శనం : టీటీడీ ఈవో

తిరుపతి, డిసెంబర్ 3: వైకుంఠ ఏకాదశి సందర్భంగా జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరిచి ఉంటాయని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. శనివారం టీటీడీ విభాగాధిపతులతో వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశికి టికెట్లు కలిగి ఉన్న భక్తులకే దర్శనానికి అనుమతిస్తామని వివరించారు.

దీనికోసం రూ. 300 ప్రత్యేక దర్శన టికెట్లు రోజుకు 25 వేలుచొప్పున జారీ చేస్తామని వివరించారు. అదేవిధంగా తిరుపతిలోని 9 ప్రాంతాల్లో సర్వదర్శనం టికెట్లు రోజుకు 50 వేలు చొప్పున టోకెన్లు జారీ చేయనున్నామని వెల్లడించారు. పదిరోజుల్లో 7.5 లక్షల మందికి సర్వదర్శనం ద్వారా వైకుంఠ ద్వార దర్శనభాగ్యం లభిస్తుందని అన్నారు. ఈ సమయంలో ఏకాంతంగా శ్రీవారి ఆర్జిత సేవలు నిర్వహిస్తామని తెలిపారు.

తిరుమల స్థానికులకు కౌస్తుభం వద్ద టోకెన్లు, శ్రీవాణి ట్రస్టు దాతలకు ఆన్‌లైన్ ద్వారా టికెట్ల జారీని కొనసాగిస్తామన్నారు. మహాలఘు ద్వారానే అందరికీ స్వామివారి దర్శనం లభిస్తుందని ఈవో పేర్కొన్నారు. డిసెంబర్ 29 నుంచి జనవరి 3 వరకు తిరుమలలో అడ్వాన్స్ గదుల బుకింగ్ నిలిపివేస్తామన్నారు. సీఆర్‌వో వద్దనే గదులను కేటాయిస్తామని ఆయన తెలిపారు.

# అసత్య ప్రచారాలు చేయడం సరైంది కాదు.. మంత్రి అమర్నాథ్

అమరావతి: డిసెంబర్ 3: రాష్ట్రం నుంచి పెట్టుబడులు తరలిపోతున్నాయంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని, ఇది సరైంది కాదని ఏపీ మంత్రి గుడవాడ అమర్నాథ్ మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ? పరిశ్రమలు వస్తే ఉపాధి లభిస్తుంది. రాష్ట్ర రెవెన్యూ పెరుగుతుందన్నారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అమర్ రాజా ప్రతినిధులు ఎక్కడైనా చెప్పారా అని ప్రశ్నించారు. ఇతర ప్రాంతాల్లో పెట్టుబడులు పెడితే ఇక్కడి నుంచి వెళ్లిపోయినట్లా అని ప్రశ్నించారు. చంద్రబాబుకు చెందిన హెరిటెజ్ వ్యాపారం ఏపీలోనే ఉందన్న ఆయన చంద్రబాబును ప్రభుత్వం ఇబ్బంది పెట్టిందా అని అడిగారు. ఏపీలో ఏ పరిశ్రమనూ రాజకీయ కోణంలో చూడలేదని మంత్రి గుడివాడ అమర్నాథ్ రెడ్డి అన్నారు.

అభ్యుదయ రచయితల సంఘం (గుంటూరు జిల్లా శాఖ)

ఆహ్వానము

చలపాక ప్రకాష్ 'కరోనా నానీలు' హిందీ అనువాదం




कोरोना का कोहराम

కరోనా కా కొహరామ్ ఆవిష్కరణ

తేది: 10 డిసెంబర్ 2022 శనివారం సాయంత్రం 6 గం.లకు
వేదిక: గుంటూరు పుస్తక మహోత్సవ ప్రాంగణం, ఏ.ఎల్.బి.ఈడి కాలేజ్, లాడ్జి సెంటర్, గుంటూరు

సభాధ్యక్షులు: సోమేపల్లి వెంకట సుబ్బయ్య
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం
పుస్తకావిష్కర్త: పెనుగొండ లక్ష్మీనారాయణ
జాతీయ కార్యదర్శి, అభ్యుదయ రచయితల సంఘం
పుస్తక సమీక్ష: షేక్ కాశీంబి
విశ్రాంత హిందీ అధ్యాపకురాలు, కవయిత్రి
హిందీ అనువాద రచయిత: డా. వెన్నా వల్లభరావు
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
మూలగ్రంథ రచయిత: చలపాక ప్రకాష్

సాహితీ ప్రియులందరికీ ఇదే మా ఆహ్వానం

# బొగ్గు గనుల వేలానికి కేంద్రం శ్రీకారం.. లిస్ట్‌లో సింగరేణిలోని నాలుగు బ్లాకులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: దేశంలోని బొగ్గు గనుల కమర్షియల్ వేలాన్ని కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల (శనివారం) మొదలుపెట్టింది. ఇందులో భాగంగా సింగరేణికి చెందిన నాలుగు బొగ్గు (బ్లాకులు) గనులను కూడా వేలానికి పెట్టింది. అయితే ఇప్పటికే సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ కేంద్రానికి సీఎం కేసీఆర్ లేఖ రాసిన సంగతి తెలిసిందే.

కాగా, మొన్నీమధ్య తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ రామగుండంలో జరిగిన సభలో మాట్లాడుతూ బొగ్గు గనులను వేలం వేయబోమని చెప్పారు. అయితే.. ఇప్పుడు అదే బొగ్గు గనులను ప్రధాని మోదీ అమ్మేందుకు రంగం సిద్ధం చేసిన విషయం బయటికి వచ్చింది. ప్రపంచంలోనే అతిపెద్ద బొగ్గు గనుల కంపెనీగా గుర్తింపు తెచ్చుకుని, లాభాల్లో వున్న కోలిండియాలో వాటాలు విక్రయించడంపై పలువురు మండిపడుతున్నారు. కోలిండియాలోని 49 శాతం వాటాలను ప్రైవేట్ వాళ్లకు విక్రయిస్తామని గతంలోనే కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగానే కేంద్రం పావులు కదుపుతోంది.

కానీ, ప్రధాని మోదీ మాత్రం రాష్ట్ర ప్రభుత్వం వాటా 51శాతం ఉంది.. కేంద్రం వాటా కేవలం 49 శాతం మాత్రమే అట్లాంటిది తామెందుకు బొగ్గు గనులను అమ్ముతాము.. ఇదంతా అబద్ధపు ప్రచారం అని సభలో చెప్పిన వీడియో ఇప్పుడు సోషల్? మీడియాలో వైరల్?గా మారింది. దీనిపై బీజేపీ నేతలు కానీ, కేంద్ర ప్రభుత్వ పెద్దలు కానీ ఏం సమాధానం చెబుతారని నెటిజన్లు నిలదీస్తున్నారు. వీడియోని చూసి బీజేపీ తీరును ఛీ కొడుతున్నారు.

# నిందితులను కఠినంగా శిక్షిస్తాం : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మహబూబ్‌నగర్, డిసెంబర్ 3: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం తిరుమలగిరి తండాలో బాలికపై లైంగిక దాడి, హత్యకు పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షిస్తామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. గ్రామ పరిధిలోని కెస్యనాయక్ తండాలో పదవ తరగతి విద్యార్థినిపై కొందరు వ్యక్తులు లైంగిక దాడి, హత్యకు పాల్పడ్డ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాదేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థిని మృతదేహాన్ని సందర్శించారు.

అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అత్యాచార ఘటన బాధాకరమని , నిందితులు ఎవరైనా సరే శిక్షించాలని పోలీస్ శాఖను ఆదేశించారు. నిందితులకు త్వరగా శిక్ష పడేలా ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

# భారత్ నాలో ఒక భాగం : సుందర్ పిచాయ్



న్యూఢిల్లీ, డిసెంబర్ 3: భారతదేశం తనలో ఒక భాగమని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ అన్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఆ వారసత్వాన్ని తన వెంటే తీసుకెళ్తానని చెప్పారు. భారత ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక పురస్కారం పద్మ భూషణ్ అవార్డును ఆయన తాజాగా అందుకున్నారు. 2022 ఏడాదికిగానూ సుందర్ పిచాయ్‌కి పద్మ భూషణ్ పురస్కారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శాన్ ఫ్రాన్సిస్కో లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య ఆయన ఈ పురస్కారం అందుకున్నారు.

అమెరికాలో భారత రాయబారి తరణ్ జిత్ సింగ్ సంధు ఈ అవార్డును సుందర్ పిచాయ్‌కి అందజేశారు. అవార్డు అందుకున్న అనంతరం సుందర్ పిచాయ్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ అవార్డు అందుకున్నందుకు చాలా గర్వంగా ఉంది. ఈ గౌరవం నాకు కల్పించిన భారత ప్రభుత్వానికి, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. భారత్ నాలో ఒక భాగం. ఎక్కడికెళ్లినా ఆ వారసత్వాన్ని నాతోనే తీసుకెళ్తా. నా తల్లిదండ్రులు, నా ఎదుగుదలకు సహకరించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు' అని పిచాయ్ పేర్కొన్నారు.






# అధికంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ : మంత్రి గంగుల



హైదరాబాద్, డిసెంబర్ 3: రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు సేకరణ సజావుగా కొనసాగుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. మినిస్టర్ క్వార్టర్స్ లో పౌర సరఫరాల కమిషనర్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత సంవత్సరం కన్నా ఇదే రోజుకి 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా సేకరించామన్నారు.

గత నవంబర్ నెలలో 25.84 మెట్రిక్ టన్నులు సేకరిస్తే, 6734 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 38.06 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ప్రైవేట్లో సైతం ఎంఎస్పీ కన్నా అధికంగా దర రావడం శుభ పరిణామమన్నారు. డిసెంబర్‌లో ధాన్యం సేకరణ వేగవంతంగా జరుగుతుందని, ప్రభుత్వం అందుకు సంబందించి అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు.

ఇప్పటి వరకు రూ. 7837 కోట్లకు గాను రైతులకు రూ. 4780 కోట్లు చెల్లించామన్నారు. ఈ సీజన్‌లో 9.52 లక్షల గన్నీలు వాడగా 9.16లక్షల గన్నీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే 729 కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తై మూసేసామన్నారు,ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ కమిషనర్ వి.అనిల్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబాటులో డబుల్ ఇంజిన్ రాష్ట్రాలు : మంత్రి హరీశ్‌రావు



కామారెడ్డి, డిసెంబర్ 3: డబుల్ ఇంజిన్ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి, సంక్షేమం వెనుకబడిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్ రావు అన్నారు. కామారెడ్డి జిల్లా పిట్లంలో 30 పడకల సీహెచ్‌సీ ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన చేసి, వ్యవసాయ మార్కెట్ వాణిజ్య దుకాణముల సముదాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక వైద్యారోగ్యం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. దయాలసిస్ పేషంట్ల సమస్యలు గుర్తించిన సీఎం కేసీఆర్ అందుబాటులోనే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.

'తెలంగాణ ఏర్పాటుకు ముందు 3 దయాలసిస్ సెంటర్లు ఉంటే, ఇప్పుడు 83 కు పెంచుకున్నాం. ఇటీవలే 8 మెడికల్ కాలేజీలు ప్రారంభించాం. 157 మెడికల్ కాలేజీల్లో తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీని కూడా కేంద్రం ఇవ్వలేదని' ఆయన వెల్లడించారు. కామారెడ్డిలో మెడికల్ కాలేజీని త్వరలో ప్రారంభిస్తామని, ఎంత మంది ఉంటే అంత మందికి కేసీఆర్ కిట్స్, న్యూట్రిషన్ కిట్ ఇస్తామని వివరించారు. మాతృ మరణాలు తగ్గించడంలో తెలంగాణ అగ్ర స్థానంలో ఉందని తెలిపారు.

తెలంగాణలో 2016 పింఛను ఇస్తే, గుజరాత్ లో 750 ఇస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పింఛన్ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్ర, కర్ణాటకలో కరెంట్ కోతలున్నాయని ఇచ్చే 8, 9 గంటలకు ముక్కు పిండి వసూలు చేస్తారని ఆరోపించారు. దేశంలో రైతులకు ఉచితంగా కరెంట్ ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని స్పష్టం చేశారు. బీజేపీ నాయకులది మాటలు ఎక్కువ చేతలు తక్కువని విమర్శించారు. ' ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇప్పటివరకు 16 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సింది 16 లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా పేదలు, నిరుద్యోగుల ఉసురు తీశారని' హరీశ్‌రావు మండిపడ్డారు.

సీఎం కేసీఆర్ మొత్తం 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కాపీ కొట్టి దేశంలో అమలు చేస్తున్నారని వెల్లడించారు. మోటార్లకు మీటర్లు పెడితే రూ. 6 వేలు ఇస్తామని కేంద్రం చెబుతున్నాకేసీఆర్ ససేమిరా అంటూ గొంతులో ప్రాణం ఉండగా మీటర్లు పెట్టను అని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే బీబీ పాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యానికే ప్రభుత్వం ప్రాధాన్యత

హైదరాబాద్, డిసెంబర్ 3: విద్య, వైద్యానికే తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మండలం కొర్రెముల పంచాయతీ పరిధిలోని జడ్పీ పాఠశాల ఆవరణలో రూ.85 లక్షల నిధులతో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం, డైనింగ్ హాలు, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాలకు మంత్రి మల్లారెడ్డి, మేడ్చల్ జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. రాష్ట్రంలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందించేందుకు వెయ్యి గురుకుల పాఠశాలలను ప్రారంభించి విద్యనందిస్తున్న ఘనత దేశంలో తెలంగాణ రాష్ట్రానికే దక్కుతుందన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 7 వేల 300 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పాఠశాలలను అభివృద్ధి చేయడంతోపాటు ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావడంతో సీట్లు దొరకడం లేదన్నారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రూ.20 లక్షల ఆర్థిక సాయాన్ని దేశంలో తెలంగాణ ప్రభుత్వమే అందిస్తుందన్నారు.

పేద రోగులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం 10వేల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. బస్తీ దవాఖానలు, పల్లె దవాఖానలు ఏర్పాటు చేయడంతోపాటు పెద్ద దవాఖానలలో అత్యాధునిక పరికరాలను సమకూర్చి పేదలకు వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధిలో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, మండల సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశ్ గౌడ్, ఎంపీడీవో అరుణ, సర్పంచ్‌లు కొంతం వెంకట్ రెడ్డి, గీతా శ్రీనివాస్, రమాదేవి రాములు గౌడ్, ఎంపీటీసీ వినోద, ఉప సర్పంచ్ కందుల రాజు, మండల టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కొండల్ రెడ్డి, నాయకులు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీల సమన్వయంతోనే.. దేశంలోకి డ్రగ్స్ రాకుండా అడ్డుకట్ట

హైదరాబాద్, డిసెంబర్ 3: మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పూర్తి స్థాయిలో ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేసి, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు సమన్వయంగా పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీఎస్ఐసీసీసీ)లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ), డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ), ఎక్సైజ్, ఎఫ్ఆర్ఆర్ఓ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, కౌంటర్ ఇంటెలిజెన్స్, హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీసులతో సీవీ సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశంలోకి డ్రగ్స్ రాకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉన్నదని, అందుకు ఏకీకృత కార్యాచరణ, సమాచార మార్పిడి, టెక్నాలజీ , అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్‌పై యుద్ధం చేస్తున్నదని, డ్రగ్స్‌కు అలవాటు పడి ప్రమాదకరమైన పరిస్థితిని పౌరులు తెచ్చుకుంటున్నారని, అలాంటి పరిస్థితి నుంచి పౌరులను రక్షించడానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. అందుకు హైదరాబాద్‌లో హెచ్‌న్యూ (హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్)ను ఏర్పాటు చేసి డ్రగ్స్‌లో డిమాండ్, సైప్లై చైన్‌ను తెంపేస్తున్నామన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడ్డ వారిలో మార్పు తీసుకొచ్చి పునరావాస చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాచకొండ సీపీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ.. డ్రగ్స్ అక్రమ రవాణాకు సంబంధించిన మార్గాలను, వాటిని ఎలా ఎదుర్కోవాలనే విషయాలపై చర్చించారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ ఎస్పీ సాయి చైతన్య మాట్లాడుతూ.. సాంకేతికంగా ఎప్పటికప్పుడు డాటాను పరిశీలిస్తున్నామన్నారు. డీఆర్ఐ అదనపు డైరెక్టర్ కె.వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. దేశంలోకి ప్రవేశించే అన్ని మార్గాలపై నిఘా ఉన్నదన్నారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ గజారావు భూపాల్, హెచ్‌న్యూ డీసీపీ చక్రవర్తి గుమ్మి, ఎన్‌సీబీ హైదరాబాద్ నుంచి సుమిత్ ఆర్య, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సరళ, ఎఫ్ఆర్ఆర్ఓ నుంచి భాగ్యలక్ష్మి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నుంచి ఖురేషి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# పద్మశాలిలు రాజకీయంగా ముందుకు రావాలి

## - టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పడతం లోకేష్ పిలుపు

హైదరాబాద్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) పద్మశాలిలు రాజకీయంగా ముందుకు రావాలని బోల్లిగుడెం టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పడతం లోకేష్ పిలుపు నిచారు. ఇటీవల బోల్లిగుడెం లోని సూరజ్ నగర్ కాలని కి జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్షులు రచ్చ శ్రీనివాస్ , జనరల్ సెక్రటరీ జే. రవి చంద్ర, కోశాధికారి కపిల్ దేవ్ లను నేడు బోల్లిగుడెం పద్మశాలి సంఘం ఆద్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి పడతం లోకేష్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న బోల్లిగుడెం ప్రాంతం లో అనేక కాలనీలు వెలిసాయని వాటిల్లో అతిపెద్ద కాలని ఐన సూరజ్ నగర్ కు ఒక పద్మశాలి అధ్యక్షులు కావడం అభినందనీయమన్నారు.ఇదే తరహాలో



నీతి, నిజాయితి కి మారు పేరైన పద్మశాలిలు రాజకీయంగా కుడా ముందుకు రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ వై నగర్ అధ్యక్షులు కొండల్ రావు,6.వర్కింగ్ ప్రెసిడెంట్ అలిగేటి దేవేందర్. ఉపాధ్యక్షులు పున్న బాలరాజు. ఉపాధ్యక్షులు గోషిక వెంకటేష్. చీఫ్ అడ్వైసర్ లక్ష్మయ్య నేత. కోశాధికారి రచ్చ వెంకటేష్. జాయింట్ సెక్రటరీ వర్కాల రాజేందర్. కార్యదర్శి మెరుగు శ్రీహరి. కార్యదర్శి నల్ల ప్రవీణ్. కార్యదర్శి గుత్తి శంకర్. అడ్వైసర్ బూర బిక్షపతి. కార్యదర్శి బూర రవీందర్. కార్యదర్శి మురళి. కార్యదర్శి బొమ్మ రమేష్.. కార్యదర్శి సిద్దు. కార్యదర్శి యాదగిరి.తదితరులు పాల్గొని రచ్చ శ్రీనివాస్ , రవి చంద్ర, కపిల్ దేవ్ లను శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

# పంజాబ్‌లో పాక్ డ్రోన్‌ను కూల్చివేసిన బీఎస్ఎఫ్ జవాన్లు

అమృత్‌సర్, డిసెంబర్ 3: పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దుల్లో పాక్ డ్రోన్‌ను బీఎస్ఎఫ్ జవాన్లు కూల్చివేశారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అంతర్జాతీయ సరిహద్దుల్లో ఉన్న చురివాలా చుస్తీ సమీపంలో బీఎస్ఎఫ్ జవాన్లు గస్తీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్ వైపు నుంచి వస్తున్న ఓ డ్రోన్‌ను గుర్తించారు. దీంతో దానిపై కాల్పులు జరిపి కూల్చివేశారు. దానిని మూడు ప్యాకెట్లలో ఉన్న 7.5 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

దీంతోపాటు ఓ పిస్తోల్, రెండు మ్యాగజైన్లు, 50 రౌండ్ల 9 ఎంఎం బుల్లెట్లను సీజ్ చేశారు. ఆ ప్రాంతంలో గాలింపు ముమ్మరం చేశామని బీఎస్ఎఫ్ అధికారులు వెల్లడించారు. ఈ కన్‌సైన్ మెంట్‌ను ఎవరికి చేరవేస్తున్నారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కాగా, ఈ ఏడాది 17 పాక్ డ్రోన్లను కూల్చివేశామని చెప్పారు.

# విశేష కృషి చేసిన సంస్థలు, వ్యక్తులకు జాతీయ అవార్డులను ప్రదానం చేయనున్న రాష్ట్రపతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: 2022, డిసెంబర్ 3న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో కేంద్ర సామాజిక న్యాయం , సాధికారత మంత్రిత్వ శాఖ వికలాంగుల సాధికారత విభాగం (దివ్యాంగజన్) ఆధ్వర్యంలో నిర్వహించే 'అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం' సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరు అవుతారు.

వికలాంగుల సాధికారతకు కృషి చేసిన వ్యక్తులు, సంస్థలు, సంస్థలు , రాష్ట్ర/జిల్లా లకు వార్షిక జాతీయ అవార్డులను రాష్ట్రపతి ప్రదానం చేస్తారు.

ఈ కార్యక్రమానికి కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ అధ్యక్షత వహిస్తారు. కేంద్ర సామాజిక న్యాయం,సాధికారిత శాఖ సహాయ మంత్రులు శ్రీ రామ్ దాస్ అథవాలే, శ్రీ ఎ. నారాయ ణ స్వామి, శ్రీమతి ప్ర తిమా భౌమిక్ కూడా ఈకార్యక్రమానికి హాజరు అవుతారు.

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ప్రతి ఏటా డిసెంబర్ 3వ తేదీ నాడు, సామాజిక న్యాయం,సాధికారిత మంత్రిత్వ శాఖ లోని వికలాంగుల సాధికారిత విభాగం (దివ్యాంగజన్) వికలాంగుల సాధికారిత దిశగా సాధించిన అద్భుత విజయాలు , కృషికి గాను వ్యక్తులు, సంస్థలు, సంఘాలు, స

2017 వరకు, అవార్డు పథకం నేషనల్ అవార్డ్స్ రూల్స్, 2013 కింద నిర్వహించ బడింది. ఇది పర్సన్స్ విత్ డిసెబిలిటీస్ యాక్ట్, 1995 ప్రకారం 7 కేటగిరీల వైకల్యతలను అందించింది. అయితే, 2017 ఏప్రిల్ 19 నుంచి వికలాంగుల హక్కుల చట్టం, 2016 అమల్లోకి రావడంతో, కొత్త చట్టం కింద నిర్దిష్ట వైకల్యాల సంఖ్య 7 నుంచి 21కి పెరిగింది.

దీని ప్రకారం, 2018 ఆగస్టు 2 న భారత అసాధారణ గెజిట్ లో నోటిపై చేయబడిన జాతీయ అవార్డు మార్గదర్శకాలలో మొత్తం 21 వైకల్యాలు చేర్చబడ్డాయి.

సామాజిక న్యాయం , సాధికారత మంత్రిత్వ శాఖ, వికలాంగుల సాధికారత విభాగం (దివ్యాంగులు) వివిధ విభాగాల్లో జాతీయ అవార్డులకు నామినేషన్లు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వాలు / కేంద్రపాలిత ప్రాంతాల నిర్వాహకులు ,కేంద్ర మంత్రిత్వ శాఖలు / విభాగాలకు లేఖలు రాస్తుంది.

పురస్కారాలకు విస్తృత ప్రచారం ఇవ్వడానికి జాతీయ /ప్రాంతీయ భాషా దినపత్రికలలో ప్రకటనలు కూడా ఇస్తారు. జాతీయ అవార్డుల సమగ్ర పథకం వివరాలను, దరఖాస్తులు కోరుతూ జారీ చేసిన ప్రకటనను కూడా డిపార్ట్ మెంట్ వెబ్ సైట్ లో డౌన్ లోడ్ చేయదగిన ఫార్మెట్ లో డిస్ ప్లే చేస్తారు. 2021 , 2022 సంవత్సరాలకు మొత్తం 21 నిర్దిష్ట వైకల్యాలకు చెందిన వ్యక్తుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఒక ప్రకటన 2022 ఆగస్టు 19 న ప్రముఖ వార్తాపత్రికలలో ప్రచురించబడింది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సెంట్రలైజ్డ్ పోర్టల్ లో మాత్రమే ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ 15 జూలై 2022 నుండి ఆగస్టు 28, 2022 వరకు తదుపరి 4-09-2022 వరకు పొడిగించారు. ప్రకటన కాపీని డిపార్ట్ మెంట్ వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయడంతోపాటుగా, విస్తృత ప్రచారం కల్పించడం కోసం రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖలు రాయడం జరిగింది. 2021 సంవత్సరానికి గాను 844, 2022 సంవత్సరానికి గాను 1210 దరఖాస్తులు వచ్చాయి. ఎంపిక ప్రక్రియ దరఖాస్తుదారులు సమర్పించిన పత్రాలు రికార్డుల పరిశీలన తో కూడుకొని ఉంది.

ఈ దరఖాస్తులను డిపార్ట్ మెంట్ ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కమిటీలు స్క్రీనింగ్ చేసి షార్ట్ లిస్ట్ చేశాయి.

# పేదింటి ఆడబిడ్డలకు టీఆర్ఎస్ సర్కారు అండ..



హైదరాబాద్, డిసెంబర్ 3: రాష్ట్రంలోని పేదింటి ఆడబిడ్డలందరికీ టీఆర్ఎస్ సర్కారు అండగా ఉంటోందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పేద కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయని గుర్తుచేశారు. మండలంలోని దుద్దేపూడి, భరిణెపాడు, కందుకూరు, వెంకటాపురం, అమ్మపాలెం, కుంచపర్తి, చిన్నమల్లేల, జయలక్ష్మీపురం, శంభునిగూడెం గ్రామాల్లో 35 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 28 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం ఆయన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు తన సొంత ఖర్చుతో 35 మందికి చీరెలు కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. పేద కుటుంబాల్లో ఆడ పిల్లల వివాహాల కోసం రూ. 1,00,116ను సాయంగా అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని స్పష్టం చేశారు. అనంతరం జయలక్ష్మీపురంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, అమ్మపాలెంలో ఉచిత ఎంపీడీ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, టీఆర్ఎస్ నాయకులు పగుట్ల వెంకటేశ్వరరావు, పాలా వెంకటరెడ్డి, కంటె వెంకటేశ్వరరావు, పుచ్చకాయల శంకర్‌రెడ్డి, ముజాహిద్, రంజిత్‌కుమార్, వాసు, ప్రకాశ్, మిరియాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో నాలుగు పులి పిల్లల మృత్యువాత.. శరీరం మీద పంటి గాటు గాయాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో ఉన్న తడోబ అంధారి పులుల అభయారణ్యంలో నాలుగు పులి పిల్లలు చనిపోయాయి. వీటిలో రెండు ఆడ, రెండు మగ పిల్లలు ఉన్నాయి. వాటి మృతదేహాల్ని శనివారం ఉదయం అటవీ అధికారులు గుర్తించారు. 'ఈపులి పిల్లలు దాదాపు 3 నుంచి 4 నెలల వయసు ఉంటాయి. షియోని అటవీ ప్రాంతంలోని 265వ నంబర్‌లో వాటి శరీరం మీద కొరికిన గాయాలు ఉన్నాయి. అవి పులి దాడిలో చనిపోయి ఉండవచ్చు' అని ఒక ఫారెస్ట్ అధికారి తెలిపాడు. మూడో రోజుల క్రితం షియోని అటవీ ప్రాంతంలో వీటి తల్లి మృతదేహాన్ని అధికారులు గుర్తించారు. ఆ ప్రదేశానికి దగ్గర్లోనే 4 పులి పిల్లల మృతదేహాలు కనిపించాయి. శుక్రవారం ఆ ప్రాంతంలో మగ పులి సంచరించినట్టు సీసీ టీవీలో కనిపించింది. దాంతో వీటిని ఆ మగ పులి చంపేసి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పులి పిల్లల మృతదేహాల్ని పోస్ట్‌మార్టం కోసం చంద్రపూర్‌లోని వెటర్నిటీ ఆస్పత్రికి తరలించారు. తడోబా టైగర్ రిజర్వ్ మనదేశంలోనే పురాతనమైనది. 1,727 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. ఇందులో దాదాపు 120కి పైగా పులులు నివసిస్తున్నాయి. ఈ ప్రాంతంలో చిరుత పులులు, అడవి బర్రెలు, హైనాలు కూడా ఉన్నాయి.

# షీ టీమ్స్ నిరంతర నిఘాతో మహిళలకు బాలికలకు భరోసా: ఎస్పీ డా. వినీత్.జి

**- షీ టీమ్స్ ఆవశ్యకతను తెలియజేయడానికి జిల్లాలో నిరంతరం అవగాహనా కార్యక్రమాలు**



భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 3 (నేటినిజం ప్రతినిధి) :భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో షీ టీమ్స్ తో మహిళలకు,బాలికలకు భరోసా కల్పిస్తున్నామని జిల్లా ఎస్పీ డా.వినీత్.జి ఐపిఎస్ అన్నారు. మహిళలు, బాలికల రక్షణ గురించి తెలంగాణ రాష్ట్రంలో పోలీసు శాఖ తరఫున షీ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లాలో 05 షీ టీమ్స్ బృందాలను ఏర్పాటు చేసి బాల బాలికలకు, విద్యార్థినీ విద్యార్థులకు రక్షణగా నిలుస్తూ సేవలు అందించడం జరుగుతుందన్నారు. 2022 సంవత్సరంలో జిల్లా షీ టీం బృందాలు కళాశాలలు,పాఠశాలలు మరియు మహిళలు ఎక్కువగా పనిచేసే ప్రదేశాల్లో 135 అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది. అంతే కాకుండా జిల్లా వ్యాప్తంగా గుర్తించిన హాట్ స్పాట్స్ వద్ద షీ టీమ్స్ లో పని చేసే అధికారులు, సిబ్బంది మఫ్టీలో నిరంతరం విధులు నిర్వర్తించడం జరుగుతుంది. ఎవరైనా ఆకతాయిలు మహిళలు, బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లయితే వెంటనే షీ టీమ్స్ వారిని అదుపులోకి తీసుకుని వారికి కౌన్సిలింగ్ లాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. మితిమీరు ప్రవర్తించిన ఆకతాయిలపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుంది. ఇప్పటివరకు షీ టీమ్స్ ద్వారా అందుకున్న ఫిర్యాదులు మేరకు జిల్లా వ్యాప్తంగా 06 కేసులను నమోదు చేయడం జరిగింది. ఈ విధంగా షీ టీమ్స్ ప్రత్యక్షంగా ఫిర్యాదులను అందుకోవడమే కాకుండా ఆన్లైన్ (క్యుఆర్ కోడ్, వాట్సాప్) ద్వారా కూడా ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించడం జరిగింది. ఇప్పటివరకు ఆన్లైన్ ద్వారా ఈ సంవత్సర కాలంలో సుమారుగా 110 ఫిర్యాదులను అందుకొని పరిష్కరించడమైనది.

మహిళలు, బాలికలపై ఆన్లైన్లో అసభ్యకరమైన పోస్టులు పెట్టె సైబర్ నేరగాళ్ల పై కూడా షీ టీమ్స్, సైబర్ టీమ్స్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాకుండా జిల్లాలో 100 పాఠశాలలు/ కళాశాలలను ఎంపిక చేసి ఒక్కో పాఠశాలకు ఇద్దరి చొప్పున విద్యార్థినులకు సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ఆకతాయిల వేధింపులను అరికట్టడంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి సైబర్ అంబాసిడర్లుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు వెంటనే జిల్లా షీ టీమ్స్ ఫోన్ నెంబర్ 7901145721 కు ఫోన్ చేసి గానీ, వాట్సాప్ ద్వారా సందేశాన్ని పంపించి గానీ వెంటనే షీ టీమ్స్ సహాయం పొందాలని విజ్ఞప్తి చేశారు.

# రైతులకు నేల సంరక్షణ, నేల సారాన్ని పెంపొందించటానికి అవగాహన

మెదక్, డిసెంబర్ 3: నేటినిజం ప్రతినిధి):ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 5న రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారుల క్లస్టర్ పరిధిలో గల రైతు వేదికలలో రైతులకు నేల సంరక్షణ, నేల సారాన్ని పెంపొందించటానికి పాటించవలసిన పద్ధతులు, మట్టి నమూనా సేకరణ, మరియు ఆవశ్యకత గురించి అవగాహనతో పాటుగా మట్టి నమూనా పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం, పచ్చిరొట్ట పంటల వాడకం, జీవన ఎరువుల వాడకంతో, పాటుగా నేలలో సేంద్రియ కర్బన పదార్థం పెంపొందించడానికి తీసుకోవాల్సిన పద్ధతులు గూర్చి రైతులకు అవగాహన కార్యక్రమం సోమవారం 5-12-2022 నాడు ఆయా రైతు వేదికల్లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది ఈ సమావేశాలకు ప్రజాప్రతినిధులతోపాటుగా రైతుబంధు గ్రామ మండల జిల్లా స్థాయి సభ్యులతో పాటుగా కోఆర్డినేటర్లు మరియు అభ్యుదయ రైతులను ఆహ్వానిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి ఆశాకుమారి తెలిపారు, ప్రపంచ మృత్తిక దినోత్సవ సందర్భంగా రైతు వేదికల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని వ్యవసాయ విస్తీర్ణాధికారులకు మండల వ్యవసాయ అధికారులకు సహాయ వ్యవసాయ సంచాలకులకు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

# సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయం... ఎంపిపి ఈదురు రాజేశ్వరి.



మహబూబాబాద్, డిసెంబర్ 3 (నేటినిజం ప్రతినిధి): పెద్ద వంగర మండలంలోని చిట్యాల గ్రామంలో బస్టాండ్ సెంటర్ వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ మరియు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చిత్రపటాలకు పెద్దవంగర ఎంపిపి ఈదురు రాజేశ్వరి పాలాభిషేకం చేయడం జరిగింది.

ఈ సంధర్భంగా ఎంపిపి, తెరాస మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్యతో కలిసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గౌడ కులస్తుల ఆరాధ్య దైవం సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని హైదరాబాదులోని ట్యాంక్ మీద ఏర్పాటు చేస్తానని నిన్న జి ఓ జారీ చేయడం హర్షనియమని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గౌడ కులస్తులకు 50 సంవత్సరాలు నిండిన వారికి 2016 రూపాయల పెన్షన్స్ మరియు గీత కార్మికులు చెట్టుపై నుండి ప్రమాదవశాత్తు పడి చనిపోతే 5 లక్షల రూపాయల ఎక్స్ గ్రేసీయా ఇవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామనీలో గౌడ కులస్తులకు మంత్రి దయాకర్ రావు 5లక్షల రూపాయలతో ఫంక్షన్ హల్ మంజూరు చేయించి నిర్మాణం చేయించడం జరిగిందని తెలిపారు. మిగులు పనులు కూడా త్వరలోనే మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు రాయిపెల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మొగులగాని హరీష్, కార్య దర్శి అనపురం యాకయ్య, కొయ్యేడి యాకయ్య, మాజీ ఉపసర్పంచ్ మొగులగాని పుల్లమ్మ వెంకటసోములు, మొగులగాని పుష్ప,గ్రామ పార్టీ అధ్యక్ష కార్యదర్శి కొల్లూరి రమేష్, వల్లపు పరమేష్,ఆవుల సోమన్న, యుపిఎస్ విద్య కమిటీ చైర్మన్ పోతుగంటి శ్రీశైలం, మహిళలు అనపురం సుజాత, అనపురం సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు...

# ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే సాధించలేనిది ఏమీ లేదు



ఖమ్మం, డిసెంబర్ 3 : (నేటినిజం ప్రతినిధి): దివ్యాంగులు ఆత్మ న్యూనతా భావాన్ని పక్కనపెట్టి ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తే సాధించలేనిది ఏమీ లేదని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో చేపట్టిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగులు వికలాంగులమనే భావనను మనసులో నుండి తీసివేయాలన్నారు. పట్టుదల, ప్రతిభ ఉన్నప్పుడే సమాజంలో రాణిస్తారని, ఎందరో దివ్యాంగులు తమ ప్రతిభతో అనేక రంగాల్లో రాణించారు అన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. జిల్లాలో 29 వేల మంది దివ్యాంగులకు ఆసరా పెన్షన్ క్రింద రూ. 3,016 అందిస్తున్నామన్నారు. ట్రై సైకిల్, దివ్యాంగులకు అవసరమైన వీల్ చైర్లు చేతి కర్రలు త్రీ వీలర్ స్కూటీలను అందిస్తున్నామన్నారు. డబుల్ బెడ్ రూమ్ పథకంలో 5 శాతం ప్రత్యేక కోటా కల్పించడం జరుగుతుందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్ లోనే కేటాయిస్తామన్నారు. ప్రపంచ దివ్యంగుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, స్త్రీ-శిశు సంక్షేమ శాఖలో భాగంగా ఉన్న దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్ జెండర్ సంక్షేమ శాఖ విభాగాన్ని ప్రత్యేక శాఖగా దివ్యాంగుల సాధికారత శాఖగా ప్రభుత్వం ఏర్పాటుకు ఆదేశాలు జారీచేసిందన్నారు. దివ్యాంగుల బ్యాక్ లాగ్ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పథకాలలో 5 శాతం దివ్యాంగులకు కేటాయించడం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ కేక్ కట్ చేశారు. దివ్యాంగుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధిహామీ దివ్యాంగ కూలీలను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి సంధ్యారాణి, డిఆర్డీఓ విద్యాచందన, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డా. మాలతి, దివ్యాంగుల సంఘం బాధ్యులు ఉప్పలయ్య, సురేష్, నాగరాజు, పెద్ద సంఖ్యలో దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలే టీఆర్ఎస్‌కు శ్రీరామరక్ష

హైదరాబాద్, డిసెంబర్ 3: అభివృద్ధి, సంక్షేమ పథకాలే టీఆర్ఎస్ పార్టీకి శ్రీరామరక్ష అని, కల్యాణలక్ష్మి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ములకలపల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. తొలుత ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు రాకుండా అడ్డుకుంటున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ చాకచక్యంతో పరిపాలన కొనసాగిస్తూ, సంక్షేమ పథకాలకు నిధుల కొరత రాకుండా చూస్తున్నారన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ మట్ల నాగమణి, సర్పంచ్‌లు భద్రం, నాగరాజు, శ్రీను, రాజేశ్, సుధాకర్, పెంటయ్య, సుశీల, విజయ, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారంపూడి అప్పారావు, ప్రధాన కార్యదర్శి శనగపాటి అంజి, ములకలపల్లి పట్టణ అధ్యక్షుడు ఉవేశ్, నాయకులు మంగపతి, చందర్‌రావు, రాజారావు, హనుమంతరావు, సుందర్‌రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట, డిసెంబర్ 2: సంక్షేమ పథకాల ఫలాలు గడపగడపకూ అందుతున్నాయని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద 17 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసి మాట్లాడారు. పేద తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. పింఛన్లు బ్యాంకు అకౌంట్లలో పడినప్పటికీ కొంతమంది బ్యాంకు అధికారులు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని లబ్ధిదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

స్పందించిన ఎమ్మెల్యే ఎంపీడీవోతో ఫోన్లో మాట్లాడి అన్ని బ్యాంకుల మేనేజర్లతో మాట్లాడి సకాలంలో పింఛను డబ్బులు అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, సర్పంచ్ ఉయ్యాల చిన్నవెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ దారా యుగంధర్, తహసీల్దార్ స్వామి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొడ్డాకుల రాజేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యుడు బుడే, పట్టణ అధ్యక్షుడు యార్లగడ్డ బాబు, వార్డు సభ్యులు పగడాల రాంబాబు, కొయ్యల అచ్యుతరావు, నాగేశ్వరరావు, అబ్దుల్ జిన్నా, పండూరి వీరబాబు పాల్గొన్నారు

# శ్రీకాంతాచారి బలిదానాన్ని ప్రజలు మరువలేరు.. వెనుకదాసుల లక్ష్మి రామచంద్రయ్య శర్మ



మహబూబాబాద్, డిసెంబర్ 3 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మలిదశ ఉద్యమంలో తొలి అమరుడైన కాసోజు శ్రీకాంతాచారి బలిదానాన్ని ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని సర్పంచ్ వెనుకదాసుల లక్ష్మి రామచంద్రయ్య శర్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో విశ్వ బ్రాహ్మణ సంఘ గౌరవ అధ్యక్షులు బోగోజు భద్రయ్య చారి ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాంతాచారి మరణం తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఆజ్యం పోసిందన్నారు. అగ్నికి ఆహుతవుతూ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడటానికి కారకుడయ్యాడన్నారు. ఆయన స్ఫూర్తితో ఉద్యమం ఎగిసి స్వరాష్ట్ర సాధనకు కారణమైందన్నారు. శ్రీకాంతాచారి త్యాగం వృథాకాలేదని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ సత్యనారాయణ ,పంచాయతీ కార్యదర్శి వెంకన్న , ఉపసర్పంచ్ శ్రీరామ్ రాము, నాయకులు మల్లికార్జున చారి, దయాకర్ రెడ్డి, చారి, శ్రీను, నాగేష్, మధు, ధర్మరపు యాకయ్య, సోమేశ్ గౌడ్, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉచిత బస్సు పాసుల పంపిణీ.



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 3 : (నేటినిజం ప్రతినిధి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 360 మంది దివ్యాంగులకు ఉచిత బస్సుపాసుల పంపిణీ కార్యక్రమం శనివారం వేములవాడ ప్రధాన బస్టాండ్ నందు నిర్వహించారు.ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్సుపాసుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందని, ×ఎవరికి వారే యమునా తీరే అనుకుంటున్నా ఈ రోజుల్లో మానవ సేవే మాధవసేవ× అంటూ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ వారు దాతల సహకారంతో ఉచిత బస్సు పాసుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వేములవాడ బస్ డిపో మేనేజర్ ఎస్ భీమ్ రెడ్డి అన్నారు. ట్రస్టు ద్వారా మా బస్ స్టాండు నందు వేసవి కాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికులకు త్రాగునీటికి ఇబ్బంది కలగకుండా దాహాన్ని తీర్చారని అదే విధంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మహిళలు పిల్లలకు పాలు ఇవ్వడానికి ఇబ్బంది కలుగుతున్న సందర్భాన్ని ట్రస్టువారు గ్రహించి సోమవారం రోజున బేబీ ఫీడింగ్ సెంటరును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారని అన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, గొంగళ్ళ రవికుమార్, డాక్టర్ బెజ్జంకి రవీందర్, ప్రతాప నటరాజు, తోట రాజు, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, ఒజ్జల సతీష్ కుమార్, నగుబోతు రవీందర్, నాగుల చంద్రశేఖర్, జూలపెల్లి రాజు, పొలాస రాజేందర్, గంద్ర రాజేందర్ మరియూ ఆర్టీసీ సిబ్బంది శ్రీనివాస్ యాదవ్, గుండెకారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2023 4 స్టార్ విభాగంలో జిల్లా దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం పట్ల సంబరాలు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 3 : (నేటినిజం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షన్ 2023 సంవత్సరానికి గాను రాజన్న సిరిసిల్ల జిల్లా మొదటి స్థానంలో నిలవడానికి హర్షిస్తూ సిరిసిల్లలో టిఆర్ఎస్ నేతలు క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

ఈ సందర్భంగా జడ్పీ చైర్పర్సన్ అరుణ రాఘవ రెడ్డి, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ ప్రజలందరి సహకారంతో స్వచ్ఛ సర్వేక్షన్ లో రాజన్న సిరిసిల్ల జిల్లాను మొదటి స్థానంలో నిలుపుకున్నామని మనందరికీ సంతోషదాయకమని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా సకల సౌకర్యాలు కల్పిస్తూ ముందుకెళ్తున్నారని అన్నారు. ఇదే తరుణంలో గ్రామాలన్నీ బంగారుమయం అవుతున్నాయని అన్నారు. మన మంత్రి కేటీఆర్ మార్గదర్శనంలో అందరి సమిష్టి కృషితో ఈ రోజు మన జిల్లా దేశంలో మొదటి స్థానం లో ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చిత్తశుద్ధితో పనులు చేస్తున్నారు కాబట్టే ఇంత గొప్ప విజయం సాధించామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో టెక్స్టైల్ చైర్మన్ గూడూరు ప్రవీణ్, రైతు బంధు సమితి అధ్యక్షుడు గడ్డం నరసయ్య, టిఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, సీనియర్ నాయకులు న్యలకొండ రాఘవ రెడ్డి, దారుణంలక్ష్మీనారాయణ, బొల్లి రామ్మోహన్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్ కోనరావుపేట ఎంపీపీ చంద్రయ్య గౌడ్, పాక్స్ చైర్మన్లు బండ నర్సయ్య, రాంమోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# తృణమూల్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ.. భారీగా మోహరించిన పోలీసులు

కోల్‌కతా, డిసెంబర్ 3: పశ్చిమబెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు సర్వసాధారణమైపోయాయి. అక్కడ నేతలు ఏ కార్యక్రమం చేపట్టినా.. దానికి ముందూవెనుక కొన్ని రోజులు కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగడం కామన్‌గా మారింది.

తాజాగా దక్షిణ 24 పరగణాల జిల్లాలో రెండు పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.

జిల్లాలోని హోతుగంజ్ ఏరియాలో రెండు పార్టీల కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. ఈ ఘర్షణల్లో బీజేపీ కార్యకర్తలు స్థానిక తృణమూల్ కార్యాలయంపై దాడిచేశారు. కార్యాలయం ఆవరణలో పార్క్ చేసి ఉన్న వాహనాలకు నిప్పుపెట్టారు.

దాంతో రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్తతో భారీగా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను రంగంలోకి దించారు.

ఇటీవల బీజేపీ సీనియర్ నేత, ప్రధాన ప్రతిపక్ష నేత సువేందు అధికారి దక్షిణ 24 పరగణాల జిల్లాలోని డైమండ్ హార్బర్‌లో బహిరంగసభ నిర్వహించారు. ఆ సందర్భంగా హోతుగంజ్‌లో రెండు పార్టీల కార్యకర్తల మధ్య తలెత్తిన ఘర్షణకు కొనసాగింపుగానే తాజా ఘర్షణలు చోటుచేసుకున్నాయని పోలీసులు తెలిపారు.




బాపట్ల జిల్లా రచయితల సంఘం, బాపట్ల
[భావపురి రచయితల సంఘం, బాపట్ల] రిజిస్టర్డ్ నెం.208/201
ఆహ్వానము
ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం
"దీపధార" కవితా సంకలనం ఆవిష్కరణ
మరియు
ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి కవితల పోటి విజేతలకు బహుమతి ప్రదానోత్సవం
తేది : 18-12-2022 (ఆదివారం) ఉదయం 10.00 గం.లకు
వేదిక :
G.S.N. టవర్స్, జి.బి.సి. రోడ్డు, S.N.P. అగ్రహారం, బాపట్ల
తిమ్మన శ్యామ్ సుందర్, అధ్యక్షుడు
నందిరాజు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి

# రిషి ద ప్లే స్కూల్లో అలరించిన ఫుడ్ ఫెస్టివల్

## -వివిధ రకాల వంటలను ప్రదర్శించిన విద్యార్థులు



కరీంనగర్, డిసెంబర్ 3: నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల రిషి ద ప్లే స్కూల్లో శనివారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం అద్భుతంగా జరిగింది. చిన్నారి విద్యార్థులు వివిధ రకాల వంటలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ నేతికుంట యాదయ్య హాజరై మాట్లాడారు ఫుడ్ ఫెస్టివల్ విద్యార్థుల ప్రదర్శన వారి సృజనాత్మక తకు మేలు చేకూరుస్తుందన్నారు. ఈ సందర్భంగా రిషి విద్యాసంస్థల చైర్మన్ కామారపు చెన్నప్ప కార్పొరేటర్ యాదయ్యను ఆత్మీయంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో రిషి స్కూల్ ఇంచార్జ్ కౌశల్ కామారపు, అడ్మిన్ రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లిఫ్ట్‌లో చిక్కుకున్న బాలుడు.. సహాయం కోసం కేకలు

లక్నో, డిసెంబర్ 3: లిఫ్ట్‌లో చిక్కుకున్న బాలుడు సహాయం కోసం కేకలు వేశాడు. చివరకు కొన్ని నిమిషాల తర్వాత ఆ బాలుడ్ని రక్షించారు. ఢిల్లీ, ఎన్సీఆర్ పరిధిలోని ఉత్తరప్రదేశ్‌కు చెందిన గ్రేటర్ నోయిడాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం సాయంత్రం నిరాలా ఆస్పైర్ సొసైటీకి చెందిన లిఫ్ట్‌లో పదేళ్ల బాలుడు చిక్కుకున్నాడు. ఈ నేపథ్యంలో బలవంతంగా లిఫ్ట్ డోర్లను తెరిచేందుకు ప్రయత్నించాడు. విఫలం కావడంతో సహాయం కోసం గట్టిగా అరిచాడు. చివరకు పది నిమిషాల తర్వాత ఆ బాలుడ్ని లిఫ్ట్ నుంచి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.

కాగా, ఈ ఘటనపై ఆ సొసైటీ వివరణ ఇచ్చింది. శుక్రవారం సాయంత్రం 5.44 గంటలకు ఈ సంఘటన జరిగినట్లు తెలిపింది. లిఫ్ట్‌లోకి వెళ్లిన బాలుడు తన సైకిల్‌తో లిఫ్ట్ డోర్‌ను కొట్టాడని, దీంతో ఐదో అంతస్తు మధ్యలో చిక్కుకున్నదని పేర్కొంది. ఈ నేపథ్యంలో లిఫ్ట్‌ను వినియోగించే పిల్లలు లిఫ్ట్ డోర్‌కు కాస్త దూరంగా ఉండేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించింది. లిఫ్ట్ సేఫ్టీపై ఎన్‌వోసీ కూడా ఉందని, అయితే ముందు జాగ్రత్త కోసం లిఫ్ట్‌ను చెక్ చేయాలని సంబంధిత కంపెనీని కోరినట్లు వెల్లడించింది.

మరోవైపు ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. అయితే ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో స్పందించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇటీవల ఘజియాబాద్‌లోని హౌసింగ్ సొసైటీ లిఫ్ట్‌లో ముగ్గురు బాలికలు చిక్కుకుని ఏడ్చిన వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. సుమారు 20 నిమిషాల తర్వాత వారిని రెస్క్యూ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఆ అపార్ట్‌మెంట్ సంఘానికి చెందిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఖమ్మం జిల్లా హోంగార్డు విభాగానికి రాష్ట్రంలోనే మంచి పేరుంది



ఖమ్మం, డిసెంబర్ 3 (నేటినిజం ప్రతినిధి): పోలీస్ శాఖలోని హోంగార్డు ఆఫీసర్లు నేడు కీలకమైన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తున్నారని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 6 నాటికి హోంగార్డు ఆర్గనైజేషన్ నెలకొల్పి 59సంవత్సరాలు పూర్తి చేసుకొని 60 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా శనివారం పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న క్రీడలను పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... సమాజానికి హోంగార్డు ఆఫీసర్స్ అందిస్తున్న సేవలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. మానసికంగా ఉల్లాసం నింపేందుకు క్రీడలు ఉపకరిస్తుందని అన్నారు.

జిల్లాలో శాంతి భద్రతలు, క్రైం, ట్రాఫిక్, కమ్యూనికేషన్స్, బందోబస్తు వంటి కీలకమైన విధులలో ఖమ్మం జిల్లా హోంగార్డు విభాగానికి రాష్ట్రంలోనే మంచి పేరుందన్నారు. కీలకమైన సమయాలలో సైతం సమయస్ఫూర్తితో వ్యవహరించారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏసీపీలు ప్రసన్న కుమార్, రవి, సిఐలు చిట్టిబాబు, శ్రీధర్, సర్వయ్య, అంజలి, అశోక్ కుమార్, ఆర్ఐలు రవి, తిరుపతి, శ్రీశైలం, సాంబశివరావు, పాల్గొన్నారు.

# సిబ్బంది, విద్యార్థుల మధ్య కేబీఆర్ పార్క్‌లో నెమలి దినోత్సవం



హైదరాబాద్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);హైదరాబాద్ నది బొడ్డులో మధ్యలో ప్రకృతి మణిహారంలా ఉన్న కాసు బ్రహ్మానంద రెడ్డి జాతీయ ఉద్యానవనం (కేబీఆర్ పార్క్) ఇరవై నాల్గవ ఏట (24) అడుగు పెట్టింది. 1998లో కేంద్ర ప్రభుత్వం ఈ అటవీ ప్రాంతాన్ని నేషనల్ పార్క్ గా ప్రకటించింది. సుమారు 380 ఎకరాల్లో విస్తరించిన కేబీఆర్ పార్క్ అటవీ ప్రాంతం అభివృద్ధి చెందిన హైదరాబాద్ కు సహజ ఆక్సిజన్ వనరుగా పనిచేస్తోంది. నిత్యం వందలాది మంది సందర్శకులు, వాకర్స్ కు కేబీఆర్ పార్క్ ప్రకృతి అందాలను పంచటంతో పాటు, విభిన్న జీవ వైవిధ్యంతో పర్యావరణ ప్రాధాన్యతను తెలుపుతోంది. ఈ పార్క్ లో విరివిగా కనిపించే జాతీయ పక్షి నెమలి పేరుమీదే ఆవిర్భావం రోజు (డిసెంబర్-3) పికాక్ డే నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈయేడాది ఉత్సవాలను వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి తరలివచ్చిన విద్యార్థుల మధ్య అటవీ శాఖ ఘనంగా నిర్వహించింది. స్కూలు పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్, ఇతర పోటీలను నిర్వహించి, బహుమతులను అందించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలు, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సభ్యుల స్నేక్ షో అలరించాయి. ముఖ్య అతిథిగా హాజరైన పీసీసీఎఫ్ (కంపా) లోకేష్ జైస్వాల్ మాట్లాడుతూ కేబీఆర్ పార్క్ రాజధాని హైదరాబాద్ కు ప్రకృతి- పర్యావరణ నిధిలాగా పనిచేస్తోందని, ఔటర్ చుట్టూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్న అర్బన్ పార్కులు మరింతగా పచ్చదనం పంచుతూ పరిసర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ ను అందిచటంతో పాటు, పర్యావరణ ప్రాముఖ్యతను చాటుతున్నాయని అన్నారు. హైదరాబాద్ చీఫ్ కన్జర్వేటర్ సైదులు మాట్లాడుతూ కేబీఆర్ పార్కులో ఈ యేడాది 544 నెమళ్ల సంఖ్య నమోదైందని, పార్క్ విశిష్టతను కాపాడుతూనే ఇక్కడికి వచ్చే సందర్శకులు, వాకర్స్ కు తగిన సౌకర్యాలు అందిస్తామన్నారు. జిల్లా అటవీ అధికారి ఎం. జోజి నేతృత్వంలో రూపొందించిన పార్క్ ప్రత్యేక బ్రోచర్ ను అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్ (విజిలెన్స్) ఏలూసింగ్ మేరు, పీసీసీఎఫ్ (ఎఫ్ సీఏ) ఎం.సీ పర్గెయిన్, అదనపు పీసీసీఎఫ్ లు త్రినాథ్ కుమార్, వినయ్ కుమార్ తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అటవీ అధికారులు, కేబీఆర్ పార్క్ సిబ్బంది పాల్గొన్నారు.

# హై లెవెల్ బ్రిడ్జికు శంకుస్థాపన చేసి ఆరు సంవత్సరాలు...!

## నత్త నడకన సాగుతున్న బ్రిడ్జి పనులు

## -వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 3 : (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని బ్రిడ్జి శంకుస్థాపన చేసి నేటికీ ఆరు సంవత్సరాలు దాటిపోయిందని ఇంతవరకు కూడా బ్రిడ్జి పనులు పూర్తి చేయడం లేదని కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడంలేదని స్థానిక పాలకుడు నిర్లక్ష్యం వల్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నాదని ఆయన అన్నారు. బ్రిడ్జి శంకుస్థాపన అప్పటి రోడ్డు భవనాల శాఖ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు 5-7-2016 నాడు బ్రిడ్జి పనుల గురించి శంకుస్థాపన చేసి నేటికీ ఆరు సంవత్సరాలు దాటిందని ఇంతవరకు కూడా ఆ పనులు పూర్తి కాలేదని ఆయన అన్నారు. బ్రిడ్జి పనులు చేస్తున్న తరుణంలో మూడుసార్లు బ్రిడ్జి కోల్పోవడం జరిగిందని ఇక్కడి పాలకుడి నిర్లక్ష్యం వల్ల పనులు నత్త నడకన సాగుతున్నాయని ఆయన అన్నారు. బ్రిడ్జి కాంట్రాక్టురు గతంలో బ్రిడ్జి ముందు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడని బిల్లులు రాక పనులు ఆపుతున్నామని అప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేసినప్పుడు ఒక బ్రిడ్జి పూర్తి చేశారని ఇంకొక బ్రిడ్జి పూర్తి చేయులేకపోతున్నారని వారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారం ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి తప్ప ఇప్పుడు ఎలాంటి అభివృద్ధి చేయలేరని వారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గారు రాజన్న ఆలయానికి ఏట 100 కోట్లు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఒక రూపాయి ఇవ్వలేరని ఆయన గుర్తు చేశారు. ముంపు గ్రామాలకు ఇచ్చిన హామీని ఇంతవరకు నెరవేర్చలేరని ఆయన అన్నారు. వెంటనే ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన కోరారు. వెంటనే హై లెవెల్ బ్రిడ్జి పనులను పూర్తి చేయాలని లేకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వారన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, నాయకులు సంఘ స్వామి యాదవ్, చిలుక రమేష్, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, ముడిగే చంద్రశేఖర్, సోయినేని కరుణాకర్, పాత సత్యలక్ష్మి, తూమ్ మధు, కనికరపు రాకేష్, కదిరే రాజ్ కుమార్ గౌడ్, తోట లహరి, నాగుల రాము గౌడ్, కూర దేవయ్య, వస్తాది కృష్ణ గౌడ్, వరిజే మల్లేశం, లింగంపల్లి కిరణ్, చిలివేరి శ్రీనివాస్ గౌడ్, పల్లపు రాజేందర్, అక్కనపెల్లి నరేష్, దండుగుల తిరుపతి, కోలాకనీ రాజు, నాగుల మహేష్, గడ్డం రేణుక, మేందె రాజు, మామిడాల శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న ములుగు ఎమ్మెల్యే సీతక్క

**- నేటి నిజం రాజన్న సిరిసిల్ల ప్రతినిధి**

శనివారం వేములవాడ పట్టణం బాలనగర్ లో జరిగిన వివాహ వేడుకల్లో ములుగు ఎమ్మెల్యే సీతక్క, కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, నాయకులు చంద్రగిరి శ్రీనివాస గౌడ్, సోయినేని కరుణాకర్, కనికరపు రాకేష్, నాగుల రాము గౌడ్, ఎడవెల్లి అనిల్, మగ్రిపల్లి రాజు, మటన్ నరేష్ తదితరులు ఉన్నారు.

# త్రో బాల్ క్రీడలో సత్తా చాటిన మల్లాపూర్ క్రీడాకారుడు



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 3 : (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన మంత్రి మనోహర్ అనే యువకుడు జాతీయస్థాయి మొదటి త్రో బాల్ పారా ఒలింపిక్స్ క్రీడలు గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్ లో జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన జాతీయస్థాయి పారా ఒలింపిక్స్ లో భాగంగా నేషనల్ మీట్ క్రీడలో తెలంగాణ రాష్ట్ర జట్టు మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది.త్రో బాల్ క్రీడకారుడైన మండలానికి చెందిన మంత్రి మనోహర్ తెలంగాణ జట్టు తరపు నుండి అత్యంత క్రీడాప్రతిభ కనబరచి పారా ఒలంపిక్స్ లో బంగారు పతకం,కప్,ప్రశంసాపత్రాన్ని కైవసం చేసుకున్నారు.

ఈ సందర్భంగా మల్లాపూర్ గ్రామస్తులు,మండలంలోని పలువురు మంత్రి మనోహర్ కు అభినందనలు తెలియజేసి, హర్షం వ్యక్తం చేశారు.

# జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే లక్ష్యం

## - 7న జరిగే ఖమ్మం నగర మహాసభను జయప్రదం చేయండి

## - టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ




ఖమ్మం, డిసెంబర్ 3 : (నేటినిజం ప్రతినిధి): జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా ఏర్పడిన టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్), మీడియా అకాడమీ చైర్మన్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ సామర్థ్యంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతున్నారని టీయూడబ్ల్యూజే (టిజెఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం జరిగిన ఖమ్మం నగర జర్నలిస్టుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల కమిటీల ఏర్పాటు, అనంతరం జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించు కునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగానే డిసెంబర్ 7న ఖమ్మం నగర మహాసభలను టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. కరోనా బారిన పడిన జర్నలిస్టులకు ప్రభుత్వం, మీడియా అకాడమీ, యూనియన్ సహకారంతో కరోనా బాధితులకు యూనియన్ల కతీతంగా సహాయం అందించామని, వివిధ కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సాయంచేసి అండగా నిలిచిన ఘనత తమ సంఘందే అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి, అభ్యున్నతకోసం నిరంతరం పాటుపడే టీయుడబ్ల్యూజేను ఆదరించాలని జర్నలిస్టులకు పిలుపుని చ్చారు. ఈ నెల 7న జరిగే ఖమ్మం నగర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సన్నాహక సమావేశంలో యూనియన్ జిల్లా, నగర నాయకులు వెన్నబోయిన సాంబశివ రావు, చిత్రా రవి, రామ్ శెట్టి విజేత, శెట్టి రజినీకాంత్, గుద్దేటి రమేష్ బాబు, అమరవరపు కోటేశ్వరరావు, కొరకొప్పుల రాంబాబు, బండి కుమార్, కుక్కల తిరుపతిరావు, మందటి రమణ, రాఘవ, ముత్యాల కోటేశ్వర రావు, నాగరాజు, రాజేంద్రప్రసాద్, కెవి, టీఎస్ చక్రవర్తి, జానీ పాషా, భాస్కర్, జగదీష్, మోహన్, యాదగి రి, జక్కుల వెంకటరమణ, పిన్నెల్లి శ్రీనివాసరావు, పిన్ని సత్యనా రాయణ, సంతోష్, ఉత్కంఠం శ్రీనివాస్, గోపి, పురుషోత్తం, వెంకటరెడ్డి, జీవన్ రెడ్డి, పానకాల రావు, ఏర్పుల నాగేశ్వరరావు, మెట్రో నాగేశ్వరావు, మందుల వెంక టేశ్వర్లు, శ్రీనివాస్, హుస్సేన్, సతీష్, అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నుమాయిష్ ఏర్పాట్లు షురూ..

హైదరాబాద్, డిసెంబర్ 3: జనవరి మాసం వచ్చిందంటే వెంటనే గుర్తుకు వచ్చేది అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్). 2023 జనవరి ఒకటవ తేదీ నుంచి నుమాయిష్‌ను ప్రారంభించేందుకు ఎగ్జిబిషన్ సొసైటీ చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా ఇప్పటికే స్టాల్‌ల కేటాయింపు, నూతన స్టాల్‌ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్విని మార్గం మాట్లాడుతూ..జనవరి ఒకటో తేదీ నుమాయిష్ ప్రారంభం నాటికి 80 శాతం స్టాల్‌లు ఏర్పాటయ్యేలా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సారి నుమాయిష్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

జనవరి ఒకటవ తేదీన ప్రారంభం కానున్న నుమాయిష్‌కు ప్రవేశ రుసుమును 40 రూపాయలుగా పెంచుతూ జనరల్ బాడీలో తీర్మానించారు. గత సంవత్సరం ప్రవేశ రుసుము 30 రూపాయలుండగా ఈ సంవత్సరం 40 రూపాయలుగా నిర్ణయించారు. ప్రతి సంవత్సరం జనవరి ఒకటవ తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు 46 రోజుల పాటు నుమాయిష్‌ను నిర్వహించనున్నారు.

# నేటి బాలలే రేపటి పౌరులు

## -మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రాజ

## - శ్రీ చైతన్య స్కూల్‌లో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 3 : (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని నవ భారత నిర్మాతలని వారి బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసికట్టుగా తోడ్పడిన అందించాలని ఎమ్మెల్యే రమేష్ బాబు అన్నారు. సమాజంలోని నైతిక విలువలు, సామాజిక పోకడల గురించి పురాణం కథల ద్వారా, పాటల ద్వారా తల్లిదండ్రుల కంటే అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలు చక్కగా నేర్పించగలరని ప్రిన్సిపాల్ డి. సుదేష్ కుమారి అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. అలాగే విద్యార్థుల అమ్మమ్మలు తాతయ్యలు ఆహ్వానించడం జరిగింది. జరిగింది. శ్రీ చైతన్య విద్య సంస్థల చైర్మన్ ఎం. శ్రీధర్ , డైరెక్టర్ ఎం. శ్రీ విద్య , డి జి ఎం లక్ష్మణ్ రావు , ఆర్ ఐ ముద్రకోల రాజు గ్రాండ్ పేరెంట్స్ డే సందర్భంగా అధ్యాపకులకు, విద్యార్థులకు , సిబ్బందిశుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో డీన్ పీ శేఖర్ , ప్రైమరీ ఇంచార్జి సృజన, పీ పీ టి ఇంచార్జి మమత, ఏ ఓ సుధీర్, శశాంక్, పీ ఈ టి సుధాకర్ మరియు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.







Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.